
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
1
మంగళవారం 3 జూన్ 2025





ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న వైటీపీఎస్ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల నిర్వాసితులు

ఆర్వోఎఫ్ఆర్ పట్టాల నిర్వాసితులకూ...

ఉద్యోగాలు!

- 200మంది గిరిజన నిర్వాసితులకు దక్కనున్న ఊరట
- తొలివిడతలో ఇళ్లు కోల్పోయిన 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలు
- మరో 440 మందికి కొనసాగుతున్న ప్రక్రియ



నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్మాణంలో అటవీభూములు కోల్పోయిన గిరిజన రైతులకు ఊరట దక్కనుంది. పట్టాభూములు కోల్పోయినవారితో సమానంగా ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాల రైతుల కుటుంబాలకు కూడా ఉద్యోగాలిప్పిస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. రాష్ట్రానికి వెలుగులు ఇచ్చే బృహత్తర ప్రాజెక్టుకు ఇళ్లు, భూములు త్యాగం చేసిన వారి కుటుంబాలకు ఉద్యోగాలిస్తామనే హామీని నెరవేర్చుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్న ప్రకారం తొలిదశలో 112 మంది గిరిజన నిర్వాసితులకు ఇప్పటికే ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. తాజాగా రెండో దశలో పట్టాభూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలిచ్చే ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఎమ్మెల్యే ప్రకటనతో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారుల సమస్య సైతం కొలిక్కివచ్చేందుకు మార్గం ఏర్పడింది. వీలైనంత వేగంగా ప్రభుత్వం నుంచి అర్హులకు నియామక పత్రాలు ఇప్పించాలని నిర్వాసిత కుటుంబీకులు కోరుతున్నారు.

రెండో విడతలో అందరికీ ఉద్యోగాలొస్తాయనే భరోసా

వైటీపీఎస్ నిర్మాణంలో ఇళ్లను కోల్పోయిన మోదుగుల కుంటతండా, కపూర్‌తండా వాసులతో పాటు, భూములను కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం(కొత్తపల్లి), తిమ్మాపురం గ్రామాలకు చెందిన మొత్తం 573 మందికి తొలుత ఉద్యోగహామీ పత్రాలు అందజేశారు. ఇళ్లను సైతం కోల్పోయిన రెండు తండాలకు చెందిన 133 కుటుంబాలు ఉండగా, వారిలో 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలివ్వగా, మరో 21 మందికి త్వరలో ఉద్యోగాలివ్వాల్సి ఉంది. వీరితో పాటు పట్టాభూములు కోల్పోయిన 440 కుటుంబాలకు కుటుంబసభ్యులు ఎవరికి ప్రతిపాదిస్తారో వారి విద్యార్హతలు, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ప్రభుత్వం సూచించింది. కాగా, వారిలో దాదాపు 344 మంది ఇప్పటికే పత్రాలను అందజేయగా, మిగిలిన 96 కుటుంబాలకు సంబంధించి కొన్నింటిపై అభ్యంతరాలుండగా, మరికొందరు ఎవరికి ఉద్యోగం ఇవ్వాలో తేల్చుకోలేక, ఉద్యోగానికి అర్హత కలిగినవారు లేకపోవడం వంటి కారణాలతో ఇంకా ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేకపోయారు. పట్టాభూములు కోల్పోయిన కుటుంబాలకు చెందినవారికి ఉద్యోగాలిచ్చే నిమిత్తం అధికారిక కసరత్తు పూర్తవగా, ప్రభుత్వం నుంచి అనుమతి రావడమే మిగిలి ఉంది. ఈ నెలలోనే అందుకు సంబంధించి ఉత్తర్వులు వస్తాయని భావిస్తున్న తరుణంలో ఇక్కడ సమస్యగా మిగిలిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారుల అంశంపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తాజాగా స్పందించి కీలక ప్రకటన చేశారు. అటవీ భూముల్లో సాగుచేసే గిరిజనులకు (ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు కలిగిన) సంబంధించి భూసేకరణ సమయంలో పరిహారం ఇచ్చి, ఉద్యోగ హామీ పత్రాలు ఇవ్వలేదు. అటవీభూములు కోల్పోయినవారు దాదాపు 200 కుటుంబాలుంటే, మలి విడత భూసేకరణలో మరో 90 కుటుంబాల వారు సైతం భూములు కోల్పోగా, వారికి సైతం ఉద్యోగపత్రాలు ఇవ్వలేకపోయారు. తాజాగా, ఎమ్మెల్యే ప్రకటనతో వీరందరికీ ఊరట దక్కే అవకాశం కనిపిస్తోంది.

అందరికీ వైటీపీఎస్‌లో ఉద్యోగాలిప్పిస్తాం



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో అటవీహక్కు యాజమాన్య పత్రాలు ఉండి, భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలకు కూడా ఉద్యోగాలిప్పిస్తాం. పట్టాభూములు కోల్పోయినవారి కుటుంబాల వారితో పాటే వీరికి కూడా ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. భూసేకరణ సమయంలో ఈ రైతుల నుంచి తీసుకున్న పట్టాలు, ఇతర డాక్యుమెంట్లన్నింటినీ వైటీపీఎస్ అధికారులకు అందజేశాం. పట్టాభూములు కోల్పోయినవారితో పాటు, ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలు కోల్పోయినవారి కుటుంబాలకు కూడా ఉద్యోగాలిప్పిస్తాం. ఎవరు అడ్డుకున్నా, ఎంత ఇబ్బందిపెట్టినా మిర్యాలగూడ అభివృద్ధికి కట్టుబడి ఉన్న.

- బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే



బయోమెట్రిక్ పరేషన్

- ఒక్కో వినియోగదారుడి నుంచి పలుమార్లు వేలిముద్రల సేకరణ
- నెలాఖరు వరకు బియ్యం పంపిణీ

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మూడు నెలలకు ఒకేసారి రేషన్ ఇవ్వాలన్న ఓ మంచి నిర్ణయానికి బయోమెట్రిక్ సమస్యగా మారింది. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఒకేసారి మూడు నెలల రేషన్ అందించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ నిర్ణయం మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం ఒకేసారి పంపిణీ చేయనున్నారు. సన్నబియ్యం పంపిణీతో పాటు మూడు నెలలు ఒకేసారి రేషన్ బియ్యం ఇవ్వనుండటంతో లబ్ధిదారులకు రేషన్‌దుకాణాలకు తిరగాల్సిన పరిస్థితి తప్పింది. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 4.66లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. అందుకు సంబంధించి 950 దుకాణాల నుంచి రేషన్‌ను సరఫరా చేస్తున్నారు. మూడు నెలలకుగాను 26,605మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నప్పటికీ బయోమెట్రిక్ విధానం సమస్యగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కిలో ఇస్తున్న నేపథ్యంలో పలుమార్లు వేలిముద్రలు వేయాల్సిన పరిస్థితి ఉండటంతో సర్వర్ బీజీగా మారింది. దీంతో ఒక్కో వినియోగదారుడు 20 నిమిషాల నుంచి గంటపాటు రేషన్‌దుకాణం వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. 10 కిలోలు, 20, 30కిలోల బియ్యం పంపిణీకే వేలిముద్రలు తీసుకుంటోందని, మిగతా బియ్యం కోసం మళ్లీ వేలి ముద్రలు వేయాల్సి వస్తోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఇద్దరు లబ్ధిదారులు ఉంటే 12కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు 10కిలోలకు ఒకసారి, రెండు కిలోలకు ఒకసారి వేలిముద్రలు తీసుకోవాల్సి వస్తోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. అదే విధంగా బియ్యం పంపిణీ చేసిన అనంతరం స్టాక్ నిల్వను కూడా సరిగా చూపడం లేదు. రేషన్ బ్యాగుల్లో కూడా తేడా ఉన్నట్లు సమాచారం. ఒక బ్యాగులో బియ్యం ఎక్కువగా మరో బ్యాగులో బియ్యం తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సాఫ్ట్‌వేర్‌ను

- మిగతా 5వ పేజీలో...



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆడబిడ్డలను

కోటీశ్వరులను చేస్తాం

- ప్రజల బంగారు భవిష్యత్తు కోసం సంక్షేమ పథకాలు
- రైతులను రుణ విముక్తులను చేశాం
- యువతకు పెరిగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల బంగారు భవిష్యత్తు కోసం పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రాష్ట్రాన్ని దేశంలో ప్రథమస్థానంలోకి తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

» ఆడబిడ్డల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని 4.64కోట్ల మంది వినియోగించుకున్నారన్నారు. అందుకు గాను మహిళలకు రూ.203.75కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 2,34,994మంది లబ్ధిదారులకు 6,47,822 సిలిండర్లు పంపిణీ చేశామని, అందుకు సబ్సిడీ రూ.18,58,74,000 ఇచ్చామన్నారు.

» ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిది నెలల్లోనే జిల్లాలో రూ.2లక్షల రుణ మాఫీ కింద మొత్తం 2,33,981మంది రైతులకు రూ.2044.83కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. రైతుభరోసా ఎకరాకు రూ.6వేల చొప్పున ఈ యాసంగిలో ఇప్పటి వరకు 4,33,543మంది రైతుల ఖాతాలో రూ.413.93కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,91,729మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని, ఇప్పటి వరకు రైతులకు రూ.1210.04కోట్లు చెల్లించామన్నారు.

» దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. పారదర్శకంగా కులగణన నిర్వహించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాజీవ్ అభయ హస్తం కింద సివిల్స్ చదివే వారికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఏడాదిలోనే 60వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు.

» ప్రతీ నియోజవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడానికి నిర్ణయించామన్నారు. జిల్లాకు 19,698 ఇళ్ల కేటాయించి 16,412 ఇళ్లకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అందులో మొదటి విడత 1,906 మంజూరు కాగా 610 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయిందన్నారు.

» బ్రాహ్మణవెల్లెంల-ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాలుగు నియోజకవర్గాలు, ఏడు మండలాలు, 94 గ్రామాలకు సాగునీరు, 107 తాగునీరు అందుతోందన్నారు. భూ సేకరణ కోసం రూ.61కోట్లను కేటాయించామన్నారు. డిండి ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం 12,454ఎకరాల భూసేకరణ చేశామన్నారు.

» నల్లగొండ పట్టణంలో లతీఫ్‌సాహెబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్ట వరకు ఘాట్ నిర్మాణం కోసం రూ.140కోట్లను మంజూరు చేశామన్నారు. కలెక్టరేట్ అదనపు గదుల నిర్మాణం కోసం రూ.36కోట్లు కేటాయించామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు వెళ్లడానికి రోడ్ల నిర్మాణానికి రూ.236కోట్లు మంజూరు చేశామన్నారు.

» జిల్లాలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపామని, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చెక్‌పోస్టు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచామన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలను మూసివేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో మూసివేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం మండలంలోని తవక్లాపూర్, డిండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని 11 కేంద్రాల్లో కొనుగోలు పూర్తిచేసేందుకు రెండు రోజులు గడువు ఉందన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు డ్రయర్‌లను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వరికోతలు ఆలస్యంగా మొదలవడంతో కొనుగోలులో జాప్యం జరిగిందని పీఏసీఎస్ అధికారులు వివరించారు. లారీల కొరత ఉందా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆరబోసిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం మానవ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో భిక్షపతి, డీఎస్‌వో వెంకటేష్, డీఎం హరీష్, తహసీల్దార్ అంబటి అంజనేయులు, డీసీవో పత్యానాయక్, డీటీ(సీఎస్) హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, ఎంఈవో గోప్యానాయక్, ఏవో రెహానా, డీఈవోలు బాల్‌రెడ్డి, అంతిరెడ్డి, ఏఈవో పరమేశ్వరి, తదితరులు ఉన్నారు.

స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన...

కొండమల్లేపల్లి: ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ పంచాయతీ సర్వే నెం. 202లో కేటాయించిన 20ఎకరాల స్థలాన్ని ఆర్డీవో రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ ఓర్సు శ్రీనివాస్, ఏఈలు లష్కర్, సర్వేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

నిడమనూరు కోర్టు రోల్ మోడల్‌గా పనిచేయాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



సభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నిడమనూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కేసులను సత్వరమే పరిష్కరిస్తూ కక్షిదారులకు న్యాయం అందించడంలో నిడమనూరు కోర్టు మిగతా కోర్టులకు రోల్ మోడల్‌గా పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అన్నారు. సోమవారం నిడమనూరు కోర్టు భవన సముదాయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజొయ్‌పాల్ వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం కోర్టు భవనాన్ని, జడ్జి నివాసాలను నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడమనూరు కోర్టుకు మూడేళ్లలో సొంత భవనం ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని, కోర్టు భవన శంకుస్థాపనకు, ప్రారంభోత్సవానికి తాను రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నిడమనూరు కోర్టు పరిధిలో 3,756 కేసులు విచారణలో ఉన్నందున అదనపు కోర్టు ఏర్పాటు అవసరముందన్నారు. నిడమనూరుకు అదనపు కోర్టును సాధించే సత్తా బార్ అసోసియేషన్‌కు ఉందన్నారు. తరచూ తాను కోర్టు పర్యవేక్షణకు వస్తానని, కోర్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కోర్టు భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయించినందుకు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. సమావేశంలో నిడమనూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పవన్‌కుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి సంపూర్ణ ఆనంద్, ఐదో అదనపు జిల్లా జడ్జి వేణు, అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, న్యాయవాదులు మువ్వా అరుణ్ కుమార్, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, పెద్దబోయిన శ్రీనివాస్, ఉన్నం సత్యనారాయణ, అబ్దుల్‌హలీం, రమణారెడ్డి, నాగరాజు, రఘురామారావు, జయమ్మ, వినోద్, వాణి, కోర్టు సిబ్బంది శర్మ, మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో 'రైతు నేస్తం'

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జేడీఏ పి. శ్రవణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతునేస్తం కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. తిప్పర్తి రైతు వేదిక నుంచి వ్యవసాయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు సూచనలు ఇస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫౌండేషన్ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



ఫౌండేషన్ విత్తనాలను అందజేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ సీడ్ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పి. శ్రవణ్‌కుమార్ కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు జిల్లాకేంద్రంలో సోమవారం ఫౌండేషన్ సీడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకొని విత్తనోత్పత్తికి కృషి చేయాలన్నారు. ధాన్యానికి సంబంధించి రెండు కిట్లు, పెసర్లు ఒక కిట్‌ను పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలోని 33 మండలాల్లో 140 క్లస్టర్‌లను ఎంపిక చేయగా అందులో 564 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి 564 గ్రామాలకు మొత్తం 1692 కిట్లు పంపిణీ చేశామని, వీటిలో వరి విత్తనాల కిట్లు 1128 ఉండగా పెసర్లు 564 కిట్లు ఉన్నాయన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసి ఆ విత్తనాలు వేయడం ద్వారా విత్తన ఉత్పత్తిని సాధించడం కోసం ఈ ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మండల ఏవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు 283 రిజిస్ట్రేషన్లు



2

నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానంలో తొలి డాక్యుమెంట్‌ను అందజేస్తున్న ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రకాష్

ప్రతి పైసా పేదలకు ఉపయోగపడాలి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసా పేదలకు ఉపయోగపడాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి, కొంపెల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో, నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చీకటిమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 21 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, ఇన్‌చార్జి ఎమ్మార్వో నరేష్, ఎంపీవో స్వరూప, కాంగ్రెస్ నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, పాల్వాయి జితేందర్‌రెడ్డి, అబ్బరబోయిన రాంయాదవ్, భీమనపల్లి సైదులు, వెదిర విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు జాల వెంకన్నయాదవ్, తాటికొండ సంతోషసైదులు, పాలకూరి యాదయ్యగౌడ్, అనంత లింగస్వామిగౌడ్, జలమణి పాల్గొన్నారు.

సాగునీటి వనరులు కనుమరుగు

భూగర్భజలాల పెంపుకోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన సాగునీటి పథకాల లక్ష్యం నీరుగారుతోంది. చెరువు, కుంటలు, చెక్‌డ్యాంలను వివిధ స్వచ్ఛం ద సంస్థల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో పనులు చేపట్టారు. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 10 చెరువులతో పాటు 171 కుంటలు, చిన్న చిన్న చెక్‌డ్యాంలు 50కి ఉండాలి. అయితే అవి నేడు కనుమరుగైపోతున్నాయి. అకాల వర్షాలు, వరదలతో చెక్‌డ్యాంలు కొట్టుకుపోగా, రియల్ వెంచర్ల మాటున చిన్ననీటి కుంటలు ఆక్రమణలతో పాటు ధ్వంసం కావడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

- (ఆంధ్రజ్యోతి-రాజాపేట)



రాజాపేట మండల కేంద్రంలో తెగిపోయిన కుంట

» ఆక్రమణలు, ధ్వంసంతో పడిపోతున్న భూగర్భజలాలు

» యాసంగిలో ఎండిన పంటలు

వర్షపు నీటిని ఒడిసి పట్టి, భూమిలో ఇంకించి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చిస్తోనంది. అందులో భాగంగా నీటి వనరుల నిల్వ కోసం పలు నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలనూ భాగస్వాముల్యులను చేసి, నీటి వనరులు-వినియోగం, భవిష్యత్ అవసరాలపై అవగాహన కల్పించారు. అయితే వీటి లక్ష్యం క్రమంగా నెరవేరడం లేదు. రాజాపేట మండలంలో బొందుగుల, కుర్రారం, సోమారం, పాంకుంట, రాజాపేట, బేగంపేట, నెమిల, దూది వెంకటాపూర్, జాల గ్రామాల్లో చెరువులు ఉన్నాయి.వీటికి తోడు పంచాయతీరాజ్‌కు సంబంధించి 64, ఇరిగేషన్‌కు చెందినవి 7, వివిధ పథకాల కింద 100 కుంటలు ఉన్నాయి. అదేవిధంగా చిన్నచిన్న చెక్‌డ్యాంలు 50కి పైగా ఉండేవి.

నీటి వనరుల పెంపు కోసం...

రాజాపేట మండలంలో ఎటువంటి సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు పూర్తిగా బోరు లు,బావులపైనే ఆధారపడి వ్యవసాయాన్ని చేస్తున్నారు. బోరు బావుల తవ్వకాల కోసం రైతులు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షాధారంగా ప్రభుత్వం భూగర్భజలాల పెంపు కోసం మండలంలో సుమారు రూ.5 కోట్లతో వాటర్‌షె డ్ పథకాలనుచేపట్టింది. పాస్, గ్రాస్ స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో నీటి వనరుల అభివృద్ధి పనులను చేపట్టారు. 10 శాతం ప్రజల వాటాతో నిధులను సేకరించి చెక్‌డ్యాంలు, కుంటలు, కంటూరు కందకాలను చేపట్టారు. ఇరిగేషన్ నిధులతో కాల్వపల్లి వాగుపై నీటి నిలుపుదల కోసం చెక్‌డ్యాంలు నిర్మించారు.

35 మీటర్ల లోతుల్లోకి...

రాజాపేట మండలంలో రెండేళ్ల కిందటి వరకు 80నుంచి 120ఫీట్లలో బోర్లలోకి నీళ్ల వచ్చేవి. ప్రస్తుతం 140మీటర్ల లోతుల్లోకి భూగర్భజలాలు పడిపోయాయి. రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఈక్రమంలో ముగిసిన యాసంగి సీజన్‌లో సాగునీటి కోసం రైతులు నానాఅవస్థలు పడ్డారు. సాగు చేసిన పంటల్లో 25 శాతం మేర నీరందక ఎండిపోయాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టాలపాలయ్యారు. ఇటీవల మండలంలోని పాంకుంటలో 1000 ఫీట్ల లోతుల్లోకి బోరు వేసినా నీటిజాడ లేకుండాపోయింది.

లోపించిన అధికారుల నిఘా

రాజాపేట మండలంలోని కొన్ని సాగునీటి వనరులు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని తీసుకున్నారు. గతంలో పంచాయతీరాజ్, ఇరిగేషన్ కింద ఇక్కడి సాగునీటి పథకాల నిర్వహణ కొనసాగేవి. కాళేశ్వరం పథకం నిర్వహణ చూస్తున్న అధికారులంతా జగదేవ్‌పూర్‌లోని ప్రధాన కార్యాలయంలో పనిచేస్తుంటారు. ఈ క్రమంలో సాగునీటి వనరుల ఆక్రమణలపై, చెరువులపై నిఘా కరువైంది. దీంతో విచ్చలవిడిగా చెక్‌డ్యాంలు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి కుంటల ధ్వంసంతో పాటు చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, భూగర్భజలాల పెంపుకోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు. లేకుంటే మండలంలోని కుంటలన్నీ రియల్ మాయాజాలంలో కనుమరుగై పూర్తిగా కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి పథకాలు ధ్వంసం...

రాజాపేట మండలంలో వివిధ పథకాల కింద చేపట్టిన నీటి సంరక్ష ణ పథకాలు నేడు కనుమరుగవుతున్నాయి. రియల్‌ఎస్టేట్ పెరగడం, యాదా ద్రి దేవస్థానానికి చేరువలో ఉండటంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ క్రమంలో కుంటలు, చెక్‌డ్యాంలను సమీపంలోని వారు తొలగించి, ఆక్రమిస్తున్నారు. మండలంలోని సగానికి పైగా చెక్‌డ్యాంలను తొలగించారు. చల్లూరు, బేగంపేట, రాజాపేట, నెమిల, బొందుగుల, పారుపల్లి, పుట్టగూడెం, కుర్రారం, పాంకుంట, జాల గ్రామాల్లో చెక్‌డ్యాలను తొలగించి చదును చేశారు. బొందుగుల, నెమిల, రాజాపేట, చల్లూరు, బేగంపేట గ్రామాల్లోని వెంచర్లలోని కుంటలను తొలగించి నామరూపాలు లేకుండా చేశారు. ఇందులో ఐబీ నిధులతో పూడికలు తొలగించిన కుంటలు కూడా ఉన్నా యి. అదేవిధంగ అకాల వర్షాలకు, వరదలతో పారుపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా కొట్టుకుపోయాయి.



బొందుగులలోని ఓ వెంచరు కోసం చదును చేసిన కుంట ప్రాంతం

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



రోజురోజుకు మండలంలో కుంటలు కనుమరుగవుతున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. వాటర్‌షెడ్ పథకంలో 10 శాతం కంట్రిబ్యూషన్ నిధులను ఎటువంటి మరమ్మతులు చేపట్టకుండానే డ్రా చేశారు. అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టి. కుంటలు, చెక్‌డ్యాంలు తొలగించిన వారి నుంచి రికవరీ చేయాలి

- దాచేపల్లి రాజు, మాజీ ఎంపీటీసీ, రాజాపేట

రియల్‌లో కనుమరుగు



రియల్ ఎస్టేట్ వ్యాపారంతో భూములకు రెక్కలొచ్చి కుంటలు, చెక్‌డ్యాంలు ఆక్రమణలకు గురయ్యాయి. నిర్మించిన కొద్దికాలానికే అకాల వర్షాలకు, వరదలకు చెక్‌డ్యాంలు తెగిపోయాయి. కాంట్రిబ్యూషన్ నిధులతో మరమ్మతులు చేపట్టలేదు. ఎటువంటి పనులు చేయకుండానే డబ్బులు డ్రాచేశారు. మరమ్మతులు లేక నీటి నిల్వలు లేక భూగర్భ జలాలు అడుగంటాయి.

- భైర పాండు, రైతు, బేగంపేట

మా దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం

రాజాపేట మండలంలో అక్రమంగా కుంటలు, చెక్‌డ్యాంలు తొలగిస్తే చర్యలు తీసుకుంటాం. నీటినిల్వలు పెరగడానికి ప్రభుత్వం కుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించింది. ఎక్కడైనా తొలగించినట్లు మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

- సాయి చైతన్య, ఏఎస్‌డబ్ల్యూ, రాజాపేట

బావిలో పడ్డ జింక పిల్ల అప్పగింత



జింకపిల్లతో అటవీశాఖ అధికారులు

తుర్కపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బావిలో జారిపడిన జింకపిల్లను రక్షించి, అటవీ అధికారులకు అప్పగించారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చిన్నలక్ష్మాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. చిన్నలక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పిన్‌రెడ్డి బాల్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావిలో కొండ గొర్రె జాతికి చెందిన జింక పిల్ల వ్యవసాయ బావిలో పడింది. పైకి ఎక్కేందుకు ప్రయత్నం చేస్తుండడంతో రైతు గుర్తించి గ్రామస్థుల సహకారంతో బయటకు తీశాడు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో జింకపిల్లను స్వాధీనం చేసుకున్న తుర్కపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జాహిద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ తుర్కపల్లి పశు వైద్యశాలలో వైద్య పరీక్షలు జరిపించారు. జింకపిల్ల ఆరోగ్యంగా ఉందని వెటర్నరీ డాక్టర్ ధ్రువీకరించడంతో సోమవారం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

ఆత్మకూరు(ఎం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామంలో మందుల వెంకటయ్యకు చెందిన పూరిగుడిసె సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధుతుడు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటయ్య(ఇంట్లో) గుడిసెలో ముగ్గురు నివాసం ఉంటున్నారు. సోమవారం భార్య హైదరాబాద్‌కు వెళ్లగా, కుమారుడితో కలిసి వెంకటయ్య కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం గుడిసె నుంచి దట్టమైన పొగలు వస్తుండటం గమనించిన స్థానికులు వెంకటయ్యకు సమాచారం అందించి, మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కొద్దిసమయంలోనే పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిఉండవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో రూ.30 వేల నగదు, బైక్, బియ్యం, వంటసామాగ్రి, బట్టలు, సర్టిఫికెట్లు దగ్ధమయ్యాయని బాధితుడు తెలిపారు. నిలువనీడ లేకుండా పోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్థులు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి కోరారు.

క్రిమిసంహారక మందులు కలపడంతో చేపలు మృతి

చిలుకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం శీత్లాతండా గ్రామంలో సోమవారం చేపల చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు క్రిమిసంహారక మందులు కలపడంతో చేపలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం శీత్లాతండా గ్రామానికి చెందిన బాణోతు కృష్ణ మూడేళ్ల కిందట 25 కుంటల్లో చేపల చెరువు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్రిమిసంహారక మందులు కలిపారు. సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లగా మృతిచెందిన చేపలు నీటిపై కనిపించాయి. దాదాపు చెరువులోని 5 టన్నుల చేపలు మృతిచెందాయని, తమను ఆర్థికంగా దెబ్బతీసేందుకే చేపల చెరువులో క్రిమిసంహారక మందులు కలిపారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదుచేశారు.



కేతేపల్లిలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెలగని వీధిలైట్లు

హైవేపై అంధకారం.. జర పైలం

(ఆంధ్రజ్యోతి-కేతేపల్లి)

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి(65వ నెంబర్)పై అంధకారం నెలకొంది. కేతేపల్లి నిమ్మలమ్మ చెరువు సమీపం నుంచి మూసీ కుడి ప్రధానకాల్వ వరకు దాదాపు కిలోమీటరు పొడవున ప్రధానరహదారితో పాటు సర్వీసు రోడ్ల వెంట హైమాస్ట్ లైట్లను రహదారి విస్తరణ సమయంలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రోజుల తరబడి అవి వెలగడం లేదు. కేతేపల్లిలో ఐదు రోజులుగా రహదారి వెంట సగం ప్రాంతంలో లైట్లు వెలగడంలేదు. దీంతో స్థానికంగా రోడ్డు దాటేందుకు జంక్షన్‌ల వద్ద పరిస్థితి ఇబ్బందిగా ఉంది. సాయంత్రం వేళ గొర్రెలు, మేకలు, పాడిగేదెలు, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే పశువులు, కాలినడకన రోడ్డు దాటే వారు రహదారిపై వేగంగా వెళ్లే వాహనచోదకులకు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో చీకట్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు స్థానికుల్లో నెలకొన్నాయి.

వీధిదీపాలు వెలగని విషయం మా దృష్టికి రాలేదు

కేతేపల్లిలో వీధిదీపాలు సక్రమంగా వెలగని విషయం మా దృష్టికి రాలేదు. సమస్యను సంబంధిత ఏజన్సీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం.

సతీష్, ఎన్‌హెచ్‌ఏఐ ప్రతినిధి

10 నెలలుగా నిర్వహణలో నిర్లక్ష్యం

జాతీయ రహదారిని నిర్మించిన జీఎమ్మార్ సంస్థ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన నాటి నుంచి గత ఏడాది వరకూ నిర్వహణ బాధ్యతలు నెరవేర్చింది. గత 10 నెలల కిందట రహదారి నిర్వహణ నుంచి సంస్థ తప్పుకోవడంతో ఆ బాధ్యతలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఓ ప్రైవేటు ఏజెన్సీకి కాంట్రాక్టు పద్ధతిన అప్పగించింది. అయితే ఆ సంస్థ రోడ్డు నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారికి సంబంధించిన సమస్య వస్తే హైవే వెంట గ్రామాల వారు ఎవరికి, ఎక్కడ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారిపై టోల్‌చార్జీలు వసూలుచేస్తున్న వారు రహదారి వెంట గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారి, హైమాస్ట్ లైట్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్సున ఢీకొన్న లారీ, ముగ్గురికి గాయాలు



బస్సును ఢీకొన్న లారీ

చింతపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్(మాల్)లో లారీ ఆర్టీసీ బస్సును సోమవారం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్సు దేవరకొండ నుంచి మాల్ బస్టాండ్‌కు వస్తుంది. హైదరాబాద్ నుంచి దేవరకొండకు వెళ్తున్న లారీ బస్టాండ్‌లోపలికి బస్సు వెళ్తుండగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బస్టాండ్ ప్రాంగణానికి వెలుపలికి-లోపలికి వెళ్లే రెండు మార్గాలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రెండుద్వారాలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ: యువకుడి మృతి

నార్కట్‌పల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పట్టణంలో నల్లగొండ రోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కట్టంగూరు మండలం పామనగుండ్ల గ్రామానికి చెందిన చెరుకు మహేష్(24) బైక్‌పై నార్కట్‌పల్లికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్ డివైడర్‌పై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న కోడెదూడెల పట్టివేత

కొండమల్లేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పశువుల సంత నుంచి అక్రమంగా 8 కోడె దూడలను హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎస్‌ఐ అజ్మీర రమేష్ తెలిపిన వివరాల ప్రకారం రెండు బొలెరో వాహనాల్లో అక్రమంగా కోడె దూడలను తరలిస్తుండగా పట్టుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెల్దండ గోశాలకు కోడె దూడలను తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐదు గేదెలు, రెండు కోడెదూడలు

తిరుమలగిరి(సాగర్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని కబేళాకు అక్రమంగా తరలిస్తున్న ఐదు గేదెలు, రెండు కోడె దూడలను స్వాధీనం చేసుకున్నట్లు తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గరకనెట్‌తండాకు చెందిన సపావత్ బూరా వద్ద నల్లగొండ పట్టణానికి చెందిన మాంసం వ్యాపారి సల్మాన్ ఐదు ఆవులను, రెండు కోడెదూడలను కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. దీంతో తునికినూతల క్రాస్‌రోడ్డు వద్ద అనుముల మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన మెగావత్ నర్సింహ ట్రాలీ వాహనాన్ని ఆపి పరిశీలించగా తాళ్లతో కాళ్లను కట్టేసి ఉన్న మూగజీవాలను గుర్తించామన్నారు. వ్యాపారి సల్మాన్ పరారు కాగా, ఆటోను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, మూగజీవాలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని కామధేను గోసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో మంటలు

ధైర్యంతో మంటలు ఆర్పిన ట్రైనీ ఎస్‌ఐ సురేష్‌రెడ్డి

గరిడేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫుడ్ సెంటర్‌లోని గ్యాస్‌సిలిండర్, స్టౌవ్‌కు ఉన్న పైప్ ఊడిపోవడం, అదే సమయంలో వంట చేస్తుండటంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కస్టమర్లు ఎవరూ లేకపోవడం ఊపిరిపీల్చుకొన్నారు. లోపల గ్యాస్ సిలిండర్ ఉండడంతో కొద్దిసేపు ఏం జరుగుతుందోనన్న భయాందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న ట్రైనీ ఎఎస్‌ఐ సురేష్‌రెడ్డి తన సిబ్బందితో ప్రమాద స్థలానికి వెళ్లారు. ధైర్యంగా మంటలు చెలరేగుతున్న సిలిండర్ వద్దకు వెళ్లి మంటలను ఆర్పివేశారు. సిబ్బంది వెంటనే నీళ్లతో షాప్‌లోని మంటలను ఆర్పివేశారు. అంతకు ముందు మంటలతో చుట్టుపక్కల దట్టంగా పొగలు వ్యాపించడంతో స్థానికులు దుకాణాలను వదిలి వెళ్లిపోయారు. ట్రైనీ ఎస్‌ఐ సురేష్‌రెడ్డి సాహసంతో మంటలను ఆర్పేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ లోని సుమారు రూ.13వేలు నగదు, కుర్చీలు, టేబుల్స్‌తో పాటు ఇంటి పట్టా కాగితాలు, ఇతర గుర్తింపు కార్డులు కాలిపోయాయి. ధైర్యంతో లోపలికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చిన ట్రైనీ ఎస్‌ఐ సురేష్‌రెడ్డి స్థానికులు అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో తొలిరోజు 283 రిజిస్ట్రేషన్లు

- **సోమవారం నుంచి స్లాట్ బుకింగ్స్ షురూ**
- **తొలి, రెండో విడతలో 3 చోట్ల**
- **తుది విడతలో మరో 12కార్యాలయాల్లోనూ..**

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో సోమవారం నుంచి స్లాట్‌బుకింగ్ విధానం మొదలైంది. మొదటి, రెండో విడతలో మూడు చోట్ల స్లాట్ బుకింగ్స్ కాగా మిగతా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ విధానం అమల్లోకి వచ్చింది. తొలి విడతలో చౌటుప్పల్, భువనగిరిలో ప్రారంభం కాగా రెండో విడతలో బీబీనగర్‌లో ఈ విధానం విజయవంతమైంది. దీంతో సోమవారం నుంచి ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, చండూరు, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, రామన్నపేట, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నిడమనూరు, సూర్యాపేట, యాదగిరిగుట్టలో స్లాట్ బుకింగ్ ప్రారంభించారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంతరాలు చోటుచేసుకోలేదు. సాంకేతిక సమస్యలతో పాటు సర్వర్ బిజీ వంటి సమస్యలు కూడా ఏర్పడలేదు. మొదటి రోజు 300 స్లాట్ బుకింగ్‌లకు గాను 283 రిజిస్ట్రేషన్లు సవ్యంగా పూర్తయ్యాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ ఎస్.ప్రకాష్ స్లాట్ బుకింగ్ విధానాన్ని పరిశీలించడంతో పాటు తొలి డాక్యుమెంట్‌ను ఆస్తుల కొనుగోలుదారుడికి అందజేశారు. నిబంధనల మేరకు ప్రతీ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 48 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని రూపొందించారు. అయితే నల్లగొండలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండటంతో 96 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో సూర్యాపేట, యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్లు అధికంగా ఉండే అవకాశాలు ఉన్నందున రోజుకు 96 స్లాట్ బుకింగ్స్ కోసం రెండు సబ్‌రిజిస్ట్రా కార్యాలయాల్లోనూ ఇద్దరు చొప్పున సబ్ రిజిస్ట్రార్‌లు ఉండేలా నియామకాలు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ : సబ్‌రిజిస్ట్రార్ ప్రభాకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : స్లాట్‌బుకింగ్ విధానంతో లబ్ధిదారులకు 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, డాక్యుమెంట్లు అందజేస్తున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం నేపథ్యంలో మరో సబ్‌రిజిస్ట్రార్ ఎండీ ఖాదర్‌పాషను ప్రభుత్వం నియమించిందన్నారు. ప్రతి రోజూ మొత్తం 96 రిజిస్ట్రేషన్లు చేసే అవకాశం ఉందని తెలిపారు.

సూర్యాపేటలో 37 రిజిస్ట్రేషన్లు

సూర్యాపేట టౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్స్ తొలిరోజు 37 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. సుమారు రూ.3 లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. అయితే గతంలో ప్రతిరోజూ 60 నుంచి 70 వరకు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. మొదటి రోజు మాత్రం 37 అయ్యాయి. అయితే ఈ విధానం వల్ల సులభవంగా పనిపూర్తవుతుందని ప్రజలు చెబుతున్నారు. గతంలో ఒక్కో రిజిస్ట్రేషన్‌కు గంట సమయం పట్టగా, ప్రస్తుతం కేవలం 10 నిమిషాల్లో పూర్తవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు రిజిస్ట్రార్లను ప్రభుత్వం నియమించింది. గతంలో ఒక్కరు ఉండగా ఆదివారం నుంచి మరో సబ్ రిజిస్ట్రార్‌ను నియమించింది. ఇదిలా ఉండగా స్లాట్‌బుకింగ్ తొలిరోజైన సోమవారం 37మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం కావడంతో సెలవు అనే భావనలో ప్రజలు ఉన్నారని తెలుస్తోంది. అంతేకాకుండా డాక్యుమెంట్ రైటర్లకు పూర్తిస్థాయిలో స్లాట్ బుకింగ్‌పై అవగాహన లేకపోవడం కూడా కారణంగా భావిస్తున్నారు. డాక్యుమెంట్ చేసే సమయంలో తప్పులు జరిగే అవకాశం ఉందని డ్యాకుమెంట్ రైటర్లు కొంత సందేహం పడ్డట్లు పలువురు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో 24 రిజిస్ట్రేషన్లు

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలిరోజైన సోమవారం స్లాట్‌బుకింగ్ ద్వారా 24 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. కాగా 5 గంటల తర్వాత జనరల్ పద్ధతిలో మరో రిజిస్ట్రేషన్ జరిగింది. సాంకేతిక లోపంతో చలాన్లు చెల్లుబాటు కాకపోవడంతో ఆలస్యంగా ఒక రిజిస్ట్రేషన్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే కొనుగోలుదారులకు డాక్యుమెంట్లు అందజేస్తున్నారు. స్లాట్ బుకింగ్స్ సమయంలో పూర్తి డాక్యుమెంట్లు స్కాన్ చేస్తున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ పూర్తికాగానే డాక్యుమెంట్లు అందజేసేందుకు మార్గం సుగమమైనట్లు అధికారులు తెలిపారు.

సందేహాల నివృత్తికి ఏఐ చాట్‌బాట్

స్లాట్‌బుకింగ్ సమయంలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంది. ముఖ్యంగా అత్యవసర సమయంలో సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా స్లాట్‌బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలకు ఎలాంటి సందేహాలు వచ్చినా తీర్చేందుకు కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తెచ్చింది. 8247623578 నెంబర్‌కు సందేహాలను వాట్సాప్ చేస్తే సందేహాలు నివృత్తి కలిగేలా ఏఐ సూచనలు చేస్తుంది. ముఖ్యంగా ఏఐ ద్వారా రిజిస్ట్రేషన్ కార్యాలయం, లోకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీలు, సమయం, గిఫ్ట్‌డీడ్, సేల్ డీడ్‌లపై వసూలు చేసే రుసుంల వంటి సమాచారం తెలుస్తుంది.

సమయం కలిసివస్తోంది

ప్రస్తుత స్లాట్‌బుకింగ్‌తో సమయం కలిసివస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానంతో వేగంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అంబేడ్కర్, సబ్‌రిజిస్ట్రార్, సూర్యాపేట

నల్లగొండ జిల్లా కోర్టుకు ఎలక్ట్రికల్ వాహనం బహూకరణ



జిల్లా కోర్టుకు ఎలక్ట్రికల్ వాహనాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు సమక్షంలో అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, తదితరులు

నల్లగొండటౌన్, రామగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా కోర్టుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ ఎలక్ట్రికల్ వాహనాన్ని బహూమతిగా అందజేశారు. జిల్లా ప్రధానన్యాయాధికారి నాగరాజు సమక్షంలో సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ జోనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ కోర్టుకు వచ్చే దివ్యాంగులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొనవద్దన్న ఉద్దేశ్యంతో వాహనాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో డీజీఎం హరికృష్ణ, బ్రాంచ్ మేనేజర్ స్వప్నిల్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ నాన్‌గెజిటెడ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కమర్షియల్ ట్యాక్స్ నాన్‌గెజిటెడ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

నల్లగొండ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కమర్షియల్ ట్యాక్స్ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం టీఎన్‌జీవోఎస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే అమరేందర్‌రెడ్డి, కార్యదర్శిగా పీ నవీన్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బీ కిరణ్‌కుమార్, కోశాధికారిగా టీ రఘువీర్‌చందర్, వైస్ ప్రెసిడెంట్లుగా ఏ రవీంద్ర, పీ యాదమ్మ, జాయింట్ సెక్రటరీలుగా ఎండీ ఖాజాజమాలుద్దీన్, వీ నర్సింహారెడ్డి, ఆఫీస్ సెక్రటరీగా రమాదేవి, కార్యనిర్వాహణ కార్యదర్శిగా పీ రాంకుమార్‌లతో పాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల మురళి, జే శేఖర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు డీవి రాజు తదితరులు అభినందించారు. కాగా ఈ ఎన్నికల్లో 102 మంది ఉద్యోగులు పాల్గొనగా ఎన్నికల అధికారులుగా ముజాయిద్ పాషా, వెంకటేశ్వర్‌రావులు వ్యవహరించారు.


కొవిడ్ కేర్

తిరగబెట్టిన కొవిడ్ కథ

కొవిడ్ కథ ముగిసిందని సంబరపడేలోపే కొత్త వేరియెంట్స్ పుట్టుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్ కేసులు ఊపందుకుంటున్న నేపథ్యంలో, తాజా కొవిడ్ వేరియెంట్లు, వాటి ప్రభావాల గురించి తెలుసుకుందాం!

వ్యాక్సీన్లు, బూస్టర్లతో కొవిడ్ రక్షణ పొందినప్పటికీ, ఆరోగ్య భద్రతా చర్యలు పటిష్ఠంగా పాటిస్తున్నప్పటికీ, కొత్త కొవిడ్ లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచడం అత్యవసరం. ఇప్పటివరకూ మన దేశంలో రెండు రకాల కొత్త వేరియెంట్లు వెలుగులోకొచ్చాయి. అవేంటంటే...

- **ఎన్‌బి.1.8.1:** ఢిల్లీ, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తున్న వేరియెంట్ ఇది. ఒమైక్రాన్‌తో సన్నిహిత సంబంధం కలిగిన ఈ వేరియెంట్, స్పైక్ ప్రొటీన్‌పరంగా స్వల్ప ఉత్పరివర్తనాలను కలిగి ఉంది. తేలికపాటి లక్షణాలతో బయల్పడుతున్న ఈ వైరస్, వ్యాక్సీన్ తీసుకోని పెద్దల్లో వేగంగా విస్తరిస్తోంది
- **ఎల్ఎఫ్.7:** ఈ వైరస్ దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో బయల్పడింది. 2022కు ముందు కొవిడ్-19 బారిన పడిన పెద్దల వ్యాధినిరోధకశక్తికి, ఈ వైరస్ ఎక్కువ నిరోధకతను కలిగి ఉండవచ్చని అధ్యయనాలు చెప్తున్నాయి.



అయితే ప్రస్తుతానికి ఈ రెండు వేరియెంట్లలో ఏ ఒక్కదాన్నీ ఆందోళనకరమైన వేరియెంటుగా వర్గీకరించడం జరగలేదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కాబట్టి వ్యాక్సీన్లు తీసుకున్న వారిని ఈ వేరియెంట్లు తీవ్ర అస్వస్థతకు గురి చేయలేవు. అయితే గొంతు నొప్పి, పొడి దగ్గు, నీరసం ఈ కొత్త వేరియెంట్ల ప్రధాన లక్షణాలు అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. రుచి, వాసన కోల్పోవడం, లాంటి కొవిడ్ సంప్రదాయ లక్షణాలేవీ లేకుండానే ప్రస్తుతం పాజిటివ్ ఫలితాలు వెలువడుతున్నాయి. వీటికి బదులుగా అలర్జీ, సాధారణ జలుబును తలపించే లక్షణాల రూపంలోనే తాజా కొవిడ్ వేరియెంట్లు బయల్పడుతున్నాయి.

వీటి మీద కన్నేసి...

- జ్వరం, లేదా చలి
- ముక్కు దిబ్బెడ, ముక్కు నుంచి నీరు కారడం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, నీరసం
- జీర్ణసంబంధ సమస్యలు (డయేరియా)
- ఒంటి నొప్పులు

ఈ లక్షణాలు కనిపిస్తే?

- ఇంటి పట్టునే శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులను పరీక్షించుకోవాలి
- బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఇంటికే పరిమితమైపోవాలి
- ఆర్‌టి-పిసిఆర్ లేదా యాంటిజెన్ పరీక్షలు చేయించుకోవాలి
- 3 నుంచి 4 రోజుల్లో లక్షణాలు అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి

ఆయుర్వేదం



వానాకాలం జలుబు, దగ్గు, జ్వరాలు సహజమే! అయితే వీటన్నిటి మూల కారణం జీర్ణ వ్యవస్థలో ఉంటుందని ఆయుర్వేదం చెప్తోంది. ఈ కాలంలో కుంటుపడే జీర్ణవ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థలను ఎలా దార్లోకి తెచ్చుకోవాలో తెలుసుకుందాం!

వానాకాలం

వేతలకు చెక్

వానాకాలంలో శరీరంలో వాతం, పిత్తం పెరుగుతాయి. ఆదాన కాలమైన వేసవిలో కుంటుపడే జీర్ణశక్తి, వానాకాలంలో మరికాస్త దిగజారుతుంది. దాంతో అరుగుదల మందగిస్తుంది. ఫలితంగా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా క్షీణించి, రోగనిరోధకశక్తి కూడా సన్నగిల్లుతుంది. దీనికి తోడు వానాకాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిములు విజృంభించడం, కలుషిత ఆహారం, నీటి వల్ల సులభంగా వ్యాధుల బారిన పడుతూ ఉంటాం.



అయితే దగ్గు, జలుబులు, జ్వరాలు చలికాలంలో కూడా వేధిస్తాయి. కానీ వాటికి ప్రధానంగా గాల్లో విస్తరించి ఉండే వ్యాధి కారక సూక్ష్మక్రిములు పొడిబారిన శ్వాసకోశ వ్యవస్థలోకి సులువుగా చొరబడి ఇబ్బంది పెట్టడమే కారణం. కానీ వానాకాలపు జలుబు, దగ్గు, జ్వరాలకు మాత్రం సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తే ప్రధాన కారణమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కాలంలో తలెత్తే అసౌకర్యాలకు కారణాన్ని బట్టి చికిత్సను అందించాల్సి ఉంటుంది.

త్రికటుతో తరిమికొట్టి...

త్రికటువులైన శొంఠి, మిరియాలు, పిప్పళ్లు ఈ కాలంలో తీసుకుంటూ ఉండాలి. ఈ పొడిని పండ్ల మీద చల్లుకుని తినొచ్చు. లేదా నేరుగా తినొచ్చు. గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని తాగొచ్చు. దీంతో జీర్ణశక్తి పెరగడంతో పాటు శ్వాసకోశ వ్యవస్థ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా రక్షణ కూడా దొరుకుతుంది. కాబట్టి రోజుకు పావు టీస్పూను చొప్పున త్రికటు తీసుకోవచ్చు. ఇదే కాకుండా తాలిసాది చూర్ణం, సీతోఫలాది చూర్ణాలు కూడా వానాకాలపు అనారోగ్యాల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. జలుబు వచ్చినా, రాబోతున్నట్టు అనిపించినా త్రికటు, లేదా సీతాఫలాది లేదా తాలిసాది చూర్ణాల్లో ఏదో ఒక దాన్ని తీసుకోవచ్చు. పెద్దలు ఉదయం, సాయంత్రం ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో లేదా గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవాలి. తేనె స్వచ్ఛంగా ఉండాలి.

జలుబు, దగ్గు, జ్వరం

జ్వరాన్ని తగ్గించడం కోసం 'షడంగ పానీయం' తీసుకోవచ్చు. అర చెంచా పొడిని రెండు గ్లాసుల నీళ్లలో కలిపి, ముప్పావు వంతుకు మరిగించి, వడగట్టి రెండు పూటలా తీసుకోవాలి. జలుబుకు 'వ్యోషాది వటి' ఉపయోగపడుతుంది. ఉదయం, రాత్రి రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. రెండేళ్ల లోపు పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గించడం కోసం 'కస్తూరి' మాత్రలు అందించాలి. ఒకటి లేదా రెండు మాత్రలను దంచి తల్లిపాలలో లేదా మరిగించి చల్లార్చిన నీళ్లలో రంగరించి పిల్లలకు పట్టించవచ్చు. 'వాయు గుళిక' జలుబుకు సమర్థమైన ఔషధం. ఈ గుళికను మూడు పూటలా తీసుకోవాలి. నవజ్వరానికి (ప్రారంభంలో ఉన్న జ్వరం) శొంఠి, అల్లపు రసం, మిరియాలు, తేనె కలిపి చెంచా చొప్పున మూడు పూటలూ ఇవ్వాలి. పొట్టలో సమస్యలకు, నీళ్ల విరోచనాలకు 'కుటజ ఘనవటి' మూడు పూటలా రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. పిల్లలకు అర మాత్ర సరిపోతుంది. ద్రవరూపంలోని కుటజారిష్ట అయితే, పెద్దలు, 15 మిల్లీ లీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. నులిపురుగుల సమస్యలు కూడా ఈ కాలంలో ఎక్కువే! దీని కోసం ద్రవరూపంలోని 'విడంగారిష్ట'ను 15 మిల్లీలీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. పిల్లలకు 10 మిల్లీలీటర్లు సరిపోతుంది.

తినవలసినవి - తినకూడనివి

ఈ కాలంలోని ఆరోగ్య సమస్యలకు సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తి ప్రధాన కారణం కాబట్టి అందుకు కారణమైన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడం మీదే ధ్యాస పెట్టాలి. అందుకోసం జీర్ణ సంబంధ సమస్యలను నియంత్రించుకోవాలి. కొన్ని పదార్థాలను తినడం మానుకోవాలి. కొన్నిటిని తప్పనిసరిగా తింటూ ఉండాలి.

- **తినకూడనివి:** పచ్చి కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగి తినాలి. మొక్కజొన్నను ఉడికించకుండా, కాల్చి తినాలి. సజ్జలు, మార్కెట్లో దొరికే పాలకూర తినకూడదు. ఇంట్లో పండించిన పాలకూర తినొచ్చు. అలాగే కాకరకాయ, క్యాబేజీ, బంగాళాదుంపలు, క్యారెట్ తినకూడదు. కఫాన్ని పెంచే చేపలు తగ్గించాలి. ఆవు పాలు తీసుకోవచ్చు. గేదె పాలు మానేయాలి. కఫాన్ని పెంచే తీపి పదార్థాలు, వెన్న, జున్ను తీసుకోకూడదు. అలాగే చల్లదనాన్ని అందించే కీర, పుచ్చ ఈ కాలంలో పనికి రాదు. మజ్జిగను నేరుగా తీసుకోకుండా మజ్జిగపులుసు రూపంలో తీసుకోవచ్చు.
- **తినదగినవి :** బెండ, పెసరపప్పు, మినపప్పు, ఉల్లి, వెల్లుల్లి తీసుకోవచ్చు. ఉల్లి, వెల్లుల్లిలో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది పేగులకు మంచిది కాబట్టి వీటిని ఈ కాలంలో తప్పనిసరిగా తీసుకోవాలి. దుంపల్లో కంద తినొచ్చు. ద్రాక్ష పండ్ల మీద తెల్లని పొర ఉంటుంది. ఇది అందరూ అనుకుంటున్నట్టు పురుగుమందులతో ఏర్పడిన పొర కాదు. అది ఆరోగ్యానికి మేలుకరమైన బ్యాక్టీరియా పొర. కాబట్టి ద్రాక్షను కడిగినా, ఈ తెల్లని పొర తొలగిపోకుండా చూసుకోవాలి. మామిడి, నిమ్మ పండ్లు తీసుకోవచ్చు. ఈ కాలంలో కొత్తిమీర, పుదీనా కూడా తీసుకోవాలి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ స్పెషలిస్ట్, శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



కంటి ఆరోగ్యం

డిజిటల్ స్క్రీన్స్ మన జీవితంలో భాగాలైపోయాయి. గంటల తరబడి కళ్లను తెరలకు అప్పగించకపోతే రోజు గడవని పరిస్థితి. అయితే ఈ జీవనశైలితో కళ్లకు కీడు కలుగుతోందా? వైద్యులేమంటున్నారు?





తెరలతో తంటా

కళ్లు పొడిబారడం, కళ్ల మంటలు, ఎరుపెక్కడం, నీరు కారడం, కనుబొమల నొప్పులు... ఇవన్నీ డిజిటల్ స్క్రీన్స్ వాడకంలో మనం చేసే పొరపాట్లకు సంకేతాలు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టివిలు మన జీవితంలో భాగాలైపోయినప్పుడు, వాటిని వినియోగించుకుంటూనే కళ్లు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు కూడా పాటిస్తూ ఉండాలి. ఏ స్క్రీన్ ఎంత దూరంలో ఉండాలి? వాటిని ఎంత సమయం పాటు చూడాలి? ఎంత వ్యవధికి బ్రేక్ తీసుకోవాలి? కళ్లు అలసటకు లోను కాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? అన్నది కూడా తెలుసుకోవాలి.

నీలి కిరణాలను వడగట్టి...

పుస్తకం చదివేటప్పుడు కళ్లకు ఎంత దూరంగా ఉంచుకుని చదువుతామో, మొబైల్ ఫోన్లను కూడా అంతే దూరంలో ఉంచి వాడుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడిపోతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. నిజానికి ఆరేళ్ల వరకూ పిల్లల కనుగుడ్లు అభివృద్ధి దశలోనే ఉంటాయి. కాబట్టి ఈలోగా అతిగా మొబైల్ ఫోన్లకు అలవాటు పడడం వల్ల పిల్లల్లో మెల్లకన్ను తలెత్తుతుంది. పెద్దలైనా అదే పనిగా రెండు గంటలకు మించి సెల్‌ఫోన్ వాడడం కళ్లకు హానికరం. ఆ రెండు గంటల్లో ప్రతి అరగంటకూ విరామం తీసుకోవాలి. పిల్లల విషయానికొస్తే, రోజు మొత్తంలో, బడిలో, ఇంట్లో కలిపి, రెండు గంటలకు మించి స్క్రీన్స్ చూడకూడదు. ఈ రెండు గంటల్లో ప్రతి 20 నిమిషాలకూ బ్రేక్ ఇవ్వాలి. పిల్లలకు సెల్‌ఫోన్స్ ఇచ్చేటప్పుడు, అలారం, స్క్రీన్ కంట్రోల్ టైమ్ సెట్ చేసి ఇవ్వడం మంచిది. వీటితో పిల్లల సెల్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేయవచ్చు. గేమ్స్ ఆడేటప్పుడు పిల్లలు మొబైల్‌ఫోన్‌ను కళ్లకు మరీ దగ్గరకు తీసుకొచ్చేస్తూ ఉంటారు. దీంతో కళ్లలో మైనస్ పవర్ పెరుగుతుంది. కాబట్టి ఈ విషయంలో పెద్దలు పిల్లలను కట్టడి చేయాలి. మరీ ముఖ్యంగా డిజిటల్ స్క్రీన్స్ నుంచి వెలువడే నీలి కిరణాల వల్ల కంటికి హాని కలుగుతుంది. కాబట్టి ఆ కిరణాలను అడ్డుకునే ఫిల్టర్లను ఫోన్లు, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్స్‌లో ఉపయోగించాలి. కళ్లజోడు అలవాటున్న వాళ్లు ఆ కిరణాలను అడ్డుకునే పూత కలిగిన జోళ్లను వాడుకోవాలి. అలాగే టివిలకు కనీసం 20 అడుగుల దూరం పాటించాలి. సాధారణ వెలుగులోనే టివి చూడాలి తప్ప, కిటికీలు, తలుపులు మూసేసి, లైట్లు ఆర్పేసి చీకట్లో టివి చూడడం సరి కాదు.

ఇలాంటప్పుడు అప్రమత్తం కావాలి

- స్క్రీన్ చూస్తున్న అరగంటకే కళ్లు మసకబారుతున్నా...
- ఒకటికి రెండు చిత్రాలు కనిపిస్తున్నా...
- కళ్లు ఎర్రబడి, నీళ్లు కారుతున్నా...
- పిల్లల్లో మెల్లకన్ను మొదలైనా...
- పిల్లలు తెరను చూడడం మొదలుపెట్టిన అరగంటకే తలనొప్పి మొదలైనా...
- పిల్లలు రాయడానికి ఇబ్బంది పడుతున్నా...
- పెద్దలు ఫాంట్ సైజు పెంచవలసిన అవసరం పడుతున్నా...

20-20-20 నియమం

ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడవలసిన నియమమిది. దగ్గర్లో ఉన్న తెరలను చూస్తున్నప్పుడు కళ్లలోని కండరాలు అలసటకు లోనవుతాయి కాబట్టి ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడగలిగితే, కంటి కండరాలు రిలాక్స్ అవుతాయి.

ఏం చేయాలి?

కళ్లు అలసటకు లోనై పొడిబారినా, మండుతున్నా, నీరు కారుతున్నా మానిటర్ల వాడకం ఆపేసి, 20-20-20 నియమం అనుసరించాలి. దీంతో ఫలితం లేనప్పుడు కంటి వైద్యులను కలిసి, వాళ్లు సూచించే కంటి చుక్కల మందులు వాడుకోవాలి. వీటితో పొడిబారిన కళ్లు తేమగా మారతాయి. ఈ చుక్కల మందును ఫ్రిజ్ డోర్‌లో దాచుకుని వాడుకోవాలి. అలాగే ఈ చుక్కల మందును ఒకసారి మూత తెరిచి, వాడడం మొదలుపెట్టిన తర్వాత నెల రోజుల వరకూ వాడుకుని, మిగతా మందును పారేయాలి. దాచుకుని వాడుకోకూడదు.

అయితే ఈ చుక్కల మందును ఎవరికి వారు కొనుక్కుని వాడుకోవడం సరి కాదు. కంటి సమస్యలకు కారణం స్క్రీన్స్ మాత్రమే అని నిర్ధారించలేం! ఇతరత్రా కంటి సమస్యల్లో కూడా ఈ లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మాత్రమే వీటిని వాడుకోవాలి.

డాక్టర్ ఎమ్. నిఖిల,
కన్సల్టెంట్ ఆప్తల్మాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్



పరిశోధన

బరువు తగ్గించే అమైనో ఆమ్లం

బరువు తగ్గడంలో అమైనో ఆమ్లం కీలక పాత్ర పోషిస్తుందని అమెరికా, కెనడా పరిశోధకులు కనుగొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

మాంసం, తృణధాన్యాల్లోని సిస్టీన్ అనే అమైనో ఆమ్లం, బరువు తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎలుకలపై చేసిన ఓ తాజా అధ్యయనంలో తేలింది. దీని వలన అమైనో ఆమ్లాలతో ఔషధాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. 9 రకాల అమైనో ఆమ్లాలు లేని ఆహారం అందించి ఎలుకలను పరిశీలించినప్పుడు, పలు అణువులను అమైనో ఆమ్లంగా మార్చే ఎంజైమ్ లోపించిన ఎలుకలు, సిస్టీన్ రహిత ఆహారం తిని వారంలోనే 31 శాతం బరువు తగ్గినట్లు నేచర్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడించారు. అయితే ఎంజైమ్ ఉన్న ఎలుకలు సిస్టీన్ రహిత ఆహారం తీసుకున్నా బరువు తగ్గలేదు. అయితే ఆ ఎంజైమ్ ఉన్న ఎలుకలు పరిమిత క్యాలరీల సిస్టీన్, మిథియోనిన్ లేని ఆహారం తీసుకున్నప్పుడు, 25 శాతం బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు కనుగొన్నారు.



మనుషులకు మంచిదేనా?

ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో చేసిన ఓ మానవ ప్రయోగంలో... సిస్టీన్, మెథియోనిన్ తక్కువగా ఉన్న ఆహారం తిన్న వారిలో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు కనుగొనలేదని, అలాగే వారు బరువు తగ్గినట్లు గుర్తించామని పరిశోధకులు వెల్లడించారు. అయితే ఈ విధమైన ఆహారం ప్రజలపై ఎంత ప్రభావంతంగా పనిచేస్తుంది, ఏ మేరకు సురక్షితమన్నది తెలుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు అవసరమని వారు పేర్కొన్నారు. సిస్టీన్ చాలా ఆహార పదార్థాల్లో ఉంటుంది కాబట్టి ఆహారం ద్వారా సిస్టీన్ అందకుండా చేయడం సవాలుతో కూడుకున్న విషయమని అభిప్రాయపడ్డారు. కాబట్టి సిస్టీన్ స్థాయులను అవసరమైన మేర తగ్గించడానికి ఔషధాలను అభివృద్ధి చేయడం సరైన మార్గమనీ, ఆ ఔషధాలు కొవ్వు తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మీకు తెలుసా?

కృత్రిమ రక్తం



రక్తదానం ప్రాణదానంతో సమానం. కానీ అనేక సందర్భాల్లో సమయానికి సరిపడా రక్తం దొరకక, సరిపోలే రక్తగ్రూపు అందుబాటులో లేక సర్జరీలు వాయిదా పడుతూ ఉండడం, ప్రాణనష్టం సంభవించడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి ఇబ్బందులకు చెల్లుచీటీ రాస్తూ, నేషనల్ డిఫెన్స్ మెడికల్ కాలేజీకి చెందిన జపాన్ పరిశోధకులు కృత్రిమ రక్తాన్ని రూపొందించారు.

ఈ కృత్రిమ రక్తాన్ని రక్తపు గ్రూపు మ్యాచింగ్‌తో సంబంధం లేకుండా, ఎవరైనా మార్పిడి చేసుకోవచ్చు. ఈ సింథటిక్ రక్తంలో ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్లు కూడా ఉంటాయి. ఇప్పటివరకూ చేపట్టిన జంతు ప్రయోగాల్లో ఈ రక్తంతో విజయవంతంగా రక్త నష్టాన్ని భర్తీ చేయగలిగారు. దానం చేసిన రక్తానికి భిన్నంగా ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కువ కాలం కూడా నిల్వ చేసుకోవచ్చు. దీన్ని గది ఉష్ణోగ్రత వద్ద ఏకంగా ఏడాది పాటు నిల్వ చేసుకుని, అత్యవసర సమయాల్లో, మారుమూల ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగించుకోవచ్చు.

ఆవిష్కరణ

గర్భం వెలుపల పిండం

శరీరం వెలుపల పిండాన్ని పెంచే వీలుండే కృత్రిమ గర్భాశయాన్ని జపాన్ అభివృద్ధి చేసింది. జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు నెలలు నిండకుండా పుట్టిన, జబ్బుపడిన పిండాలకు చికిత్సలందించి, ప్రాణాలను కాపాడడం కోసం, ఎక్స్ వివో యుటెరిన్ ఎన్విరాన్‌మెంట్ థెరపీ ప్రధానంగా ఈ ఆవిష్కరణకు పూనుకుంది. ఈ కృత్రిమ గర్భాశయం, నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో తలెత్తే సమస్యలను అడ్డుకునే నియంత్రిత పర్యావరణాన్ని కలిగి ఉండడం విశేషం. అయితే మానవ శరీరం వెలుపల తొమ్మిది నెలల పిండాన్ని పెంచడం ఈ సాంకేతిక ఆవిష్కరణ ఉద్దేశం కాదనీ, కేవలం నెలలు నిండకుండా పుట్టిన పిల్లల ప్రాణాలను కాపాడడమే తమ ప్రధాన ఉద్దేశమని ఈ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.



వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామ్యీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గొమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి

తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికి ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీ కోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి

దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి

కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యూండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది





శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

బయోమెట్రిక్ పరేషన్



(1వ పేజీ తరువాయి)

కూడా మార్చడంతో సమస్యలు ఏర్పడ్డాయి. గతంలో నెలకు సంబంధించి రేషన్ పంపిణీపై సమాచారం ఉండగా, ప్రస్తుతం మూడు నెలలకు బియ్యం పంపిణీ కావడంతో డీలర్లు కొంత అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. దీంతో కొన్ని చోట్ల దుకాణాలను తెరవని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై నల్లగొండ డీఎస్ఓ వెంకటేశ్వర్లును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా జిల్లాలో రేషన్ పంపిణీలో ఎలాంటి సమస్య లేదని సవ్యంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా డీటీసీఎస్ రాజశేఖర్‌ను వివరణ కోరగా, కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా ప్రారంభంలో ఇబ్బంది ఉంటుందని, ఆతర్వాత సమస్యలు ఉండవన్నారు.

యాదగిరిగుట్టలో శిల్పకళా కోర్సు

- ● నిర్మాణ శిల్ప సంస్థలో ప్రవేశాలకు ఆహ్వానం
- ● నలుగురు అధ్యాపకులు.. నాలుగో బ్యాచ్
- ● 26 వరకు బీఏ కోర్సులో చేరేందుకు అవకాశం



యాదగిరిగుట్ట పట్టణంలో తాత్కాలిక భవనంలో ఆలయ నిర్మాణ శిల్ప కళాశాల

యాదగిరిగుట్ట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం అంతర్జాతీయ దివ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. అనుభజ్ఞులైన ప్రధాన స్థపతులు పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం జరిగింది. 2,500 మంది శిల్పులు, 240 దేవతామూర్తులు, దశమూర్తులు, దశావతారాలు, ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహాలను చెక్కారు. వైటీడీఏ(యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి సంస్థ) ఆలయం నిర్మాణ దశలో ప్రారంభమైనప్పటి నుంచీ ప్రభుత్వ అనుబంధంగా కొనసాగుతోంది. సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప సంస్థ పేరుతో యాదగిరిగుట్ట పట్టణం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కళాశాలను నెలకొల్పింది.

2019లో కళాశాల ఏర్పాటు

2019 సంవత్సరంలో హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్(జేఎన్‌టీయూ) యూనివర్సిటీ అనుబంధంగా ఆలయ నిర్మాణ శిల్ప సంస్థ పేరుతో కళాశాలను స్థాపించారు. అప్పటి నుంచి 2022 సంవత్సరం వరకు 10 మంది విద్యార్థులతో 11నెలల పాటు సర్టిఫికెట్ కోర్సుతో కళాశాల ప్రారంభమైంది. తిరిగి మొదటిసారి 2022 సంవత్సరం నుంచి యూనివర్సిటీ 15మంది విద్యార్థులతో డిగ్రీ కోర్సుకు అనుమతించింది. 2025-26 విద్యా సంవత్సరానికి నలుగురు అధ్యాపకులచే నాలుగో బ్యాచ్ కోసం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతిమ, ప్రసాద భాగాలతో పాటు ఆంగ్లం, సంస్కృతం పాఠ్యాంశాలు కలిపి సంప్రదాయ, శిల్ప, ఆలయ వాస్తు కోర్సులో నాలుగు పాఠ్యాంశాలతో విద్యను బోధిస్తున్నారు. ఈ కోర్సులో థియరీ, ప్రాక్టికల్ పద్ధతిలో విద్య నభ్యసించాల్సి ఉంటుంది. ఉదయం 9.30 నుంచి 12.30గంటలు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

కోర్సులు..

మూడేళ్ల పాటు సాగే కోర్సుల్లో ప్రథమ సంవత్సరం డ్రాయింగ్‌పై అవగాహన, ప్రతిమను ఎలా గీసుకోవాలి? ప్రతిమ ఆకృతి నిర్మాణం ఎలా రావాలి? శిల్పం, ముఖం, మెడ, కొలతలు ఏ విధంగా ఉండాలి? తదితరాల అంశాలపై అవగాహన కల్పిస్తారు. మిగత రెండేళ్ల పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. పీవోపీ, స్టోన్, మెటల్‌తో విద్యార్థులకు శిల్పకళలపై మెళకువలు నేర్పిస్తారు. ఆలయ నిర్మాణ శిల్పకళ వాస్తు శిల్పం, ఇతర సంబంధిత కళారూపాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

నిధులు పెండింగ్

కళాశాల నిర్వాహణకు ఏడాది రూ.కోటి విడుదలకు ప్రభుత్వం అంగీకరించినా అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. కాగా, కళాశాలలో తరగతులు నిర్వాహణకు 50శాతం సీజీఎఫ్ నుంచి దేవాదాయ శాఖ, 50శాతం యాదగిరిగుట్ట దేవస్థానం సమకూర్చిన నిధులతో కొనసాగుతోంది. మొదటి సంవత్సరం బిల్లు మంజూరు కాగా రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు

ఇంటర్మీడియట్ విద్య పూర్తిచేసి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కళాశాలలో బీఏ కోర్సులో చేరేందుకు ఆహ్వానించింది. ఈ ఏడాది విద్యాసంవత్సరానికి ఈ నెల 26 సాయంత్రం 4.30 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంది. వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైటీడీఏ.ఇన్ వెబ్‌సైట్ లేదా 040-23400616, 9705887664 నంబర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

శిల్ప కళపై విద్యార్థులకు శిక్షణ



2019 సంవత్సరం యాదగిరిగుట్ట పట్టణంలో ప్రపథమంగా కళాశాలను స్థాపించారు. వైటీడీఏ ఆధ్వర్యంలో శిల్పకళా సంస్థను తిరుమల తిరుపతి, మహాబలిపురం వంటి సంస్థలకు దీటుగా కొనసాగుతోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఆలయ సంప్రదాయ, శిల్ప, వాస్తుశాస్త్ర కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ పొందుతు న్నారు. ఇప్పుడు కొత్తగా కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానించాం. ఆసక్తి గల విద్యార్థులు శిక్షణ పొందినవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయి.

● డాక్టర్ జాటావత్ మోతిలాల్, స్థపతి, కళాశాల ప్రిన్సిపాల్, యాదగిరిగుట్ట

జెండా ఆవిష్కరణ



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట కొండపైన ప్రొటోకాల్ కార్యాలయం ఎదురుగా దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో వెంకట్రావ్ జాతీయ జెండా ఆవిష్కరించారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆలేరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని విక్రయించాలని జిల్లా అంతర్గత విత్తన తనిఖీ బృందం అధికారులు ఏడీఏ శాంతి నిర్మల, ఏవో సుధారాణి ఆదేశించారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని శ్రీలక్ష్మీనర్సింహ, విశ్వనాథం విత్తనాల ఎరువుల దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మల్లేశానికి గద్దర్ అవార్డు అభినందనీయం



చింతకింది మల్లేశంను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆసు యంత్రం సృష్టించి పద్మశ్రీ అవార్డు అందుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన చింతకింది మల్లేశానికి 'మల్లేశం' సినిమా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుకు ఎంపికై మరో చరిత్ర సృష్టించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్లేశంను ఆయన సోమవారం సన్మానించారు. ఈ అవార్డులతో ఆలేరు ఖ్యాతిని రాష్ట్ర వ్యాప్తంగా చాటారన్నారు. వారికి ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పాశికంటి శ్రీనివాస్, ఆడెపు బాలస్వామి, బేతి రాములు, బింగి నర్సింహులు, బడుగు జహంగీర్, శ్రావణ్, సిద్దులు, నారాయణ, బోగ సంతోష్, కటకం బాలరాజు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రం.. కోలాహలం



షెడ్డు కింద సేదతీరుతున్న భక్తులు

యాదగిరిగుట్ట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం సోమవారం భక్తులతో కోలాహలంగా మారింది. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ చేయగా రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ప్రధానాలయం, శివాలయం, కల్యాణ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో సందడి నెలకొంది. సుమారు 36 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక, ఉచిత ధర్మ దర్శన క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు సందడిగా మారాయి. ప్రత్యేక దర్శనాలకు గంటన్నర, ధర్మదర్శనాలకు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 43,72,183 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావ్ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొండపైన ప్రొటోకాల్ కార్యాలయం ఎదురుగా దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉదయం పండితుల వేద మంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు చేసి 8.30 గంటలకు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమేష్‌బాబు, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి కొండపై హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు.

రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులు

6వ తేదీన తిర్మలాపూర్‌లో సీఎం శంకుస్థాపన : విప్ అయిలయ్య



అధికారులతో కలిసి సీఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ అయిలయ్య

తుర్కపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1500 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి మండలంలోని తిర్మలాపూర్‌లో శంకుస్థాపన చేస్తారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. తుర్కపల్లి మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఈ నెల 6న మండలంలోని తిర్మలాపూర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కలెక్టర్ హనుమంతరావు, వివిధ జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో పర్యటించి ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, దేశం, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులకు అన్ని మౌళిక వసతులు కల్పించేందుకు రూ. 100కోట్లను మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారన్నారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్న గందమల్ల చెరువును రూ.700 కోట్లతో రిజర్వాయర్ చేసేందుకుగాను సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా 15 మండలాల్లో సుమారు వంద ఎకరాలకు గ్రావిటి ద్వారా గోదావరి జలాలతో సాగు నీటి తీరుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అధిక సంఖ్యలో ఉన్నందున రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తారని, ఈ ప్రాంతంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందనుందన్నారు. అదే విధంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతంలో రూ. 183కోట్లతో నిర్మించే మెడికల్ కళాశాల, రూ.45 కోట్లతో వేద పాఠశాల, మోటకొండూర్ మండలంలో నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పలు అభివృద్ధి పనులకు సీఎం శంఖుస్థాపన చేస్తారన్నారు. 100 ఎకరాల్లో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ భాస్కర్‌రావు, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి ఉన్నారు.

ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



తేజశ్రీ, హన్వితశ్రీ, జె. మేనక, టి. అమూల్య, బి. లాస్య, డి. జగదీష్‌రాజు

సూర్యాపేటఅర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు.

ఐఐటీ, జేఈఈ ఫలితాల్లో జయ విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట పట్టణంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారని జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. జి. తేజశ్రీ(1505), సీహెచ్. హన్వితశ్రీ (2040), జె. మేనక (2146), టి. అమూల్య(4877), డి. లాస్య (5766), డి. జగదీష్‌రాజు(8076)వర్యాంకు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో జయ డైరెక్టర్‌లు బింగిజ్యోతి, జెల్లా పద్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ విద్యార్థుల ప్రతిభ..



మోహిత్ రాజనాయక్, ఆనంద్

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. భూక్య మోహిత్ రాజ నాయక్ ఆలిండియా 19వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి) సాధించాడని కరస్పాండెంట్ బికుమళ్ల కిరణ్‌కుమార్ తెలిపారు. డీ. ఆనంద్ 1840వ ర్యాంకు సాధించారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

మెరిసిన గిరిజన ఆణిముత్యం



మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలేనికి చెందిన భూక్య కోటేష్ జేఈఈ అడ్వాన్ ఫలితాల్లో రాష్ట్రంలో ఎస్టీ కేటగిరిలో 238 ర్యాంకు సాధించాడు. కుమారుడికి మంచి భవిష్యత్ ఇవ్వాలనే సంకల్పంతో చదివించామని కోటేష్ తల్లిదండ్రులు భూక్య రవీందర్, సీతమ్మ తెలిపారు.

ఐఐటీ, జేఈఈ ఫలితాల్లో ప్రగతి విద్యార్థుల ప్రతిభ



ఆర్.కృష్ణ, ధనావత్ చరణ్, దోమలపల్లి చరణ్, కె. సమీరా

నల్లగొండ టౌన్: ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలల్లో నల్లగొండ పట్టణంలో ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ కేటగిరీల్లో ర్యాంకులు సాధించారు. ఆర్.కృష్ణ 480వ ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. డి. చరణ్ 1569, డి. చరణ్ 2960, కె. సమీరా 4122వ ర్యాంకు సాధించారు. విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్‌లు ఏ. నరేందర్‌బాబు, శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు.

ఎస్ఆర్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలల్లో చర్లపల్లిలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారు. సపావట్ పవన్‌కు ఆలిండియా స్థాయిలో 204వ ర్యాంకు, భర్మావత్ సుమన్ 1049వ ర్యాంకు సాధించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోటీలు ముగిసినట్లు కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపైర్ల కమిటీ రాష్ట్రస్థాయికి ఎంపిక చేసింది. అండర్ 11, 13, 15 బాలబాలిక విభాగాల్లో ఆరుగురు, అండర్ 17 బాలబాలిక విభాగాల్లో 8 మంది, అండర్-19 విభాగంలో ఆరుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పురుషుల విభాగంలో నలుగురు, మహిళల విభాగంలో ఇద్దరు క్రీడాకారులు స్టేట్ లెవల్‌కు ఎంపికైనట్లు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ. శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో మధుబాబు, నవీన్ కుమార్, ప్రణీత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి

మునుగోడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సీడ్ టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ వి.సంతోష, మునుగోడు ఎంఏవో ఎస్.పద్మజ అన్నారు. పట్టణంలోని వివిధ ఎరువులు, విత్తనాల దుకాణాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలతో పాటు బిల్లుల రికార్డులను పరిశీలించారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలు మాత్రమే నిర్ణయించిన ధరలకు అమ్మాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత

గట్టుప్పల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యుడు బుర్ర రాములు మృతి చెందడం బాధాకరమని మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో రాములుకు సంతాపం తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షుడు ఐతరాజు హనుమంత్ ద్వారా రాములు కుటుంబసభ్యులకు రూ.10వేలు పంపించారు. కార్యక్రమంలో దండకం శంకర్, నరసింహ, మల్లేష్ గౌడ్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి రెవెన్యూ

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



చండూరు: రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ కిరణ్మయి

చండూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్మయి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 16వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో రెండు టీంలు ఏర్పాటు చేసి సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ యజమానులు, రైతులు తమ భూమి రికార్డుల్లో ఏమైనా తప్పులు ఉన్నా, లేదా అర్హత ఉండి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోయినా, మరే ఇతర భూ సమస్యలు ఉన్నా ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులను రెండు టీంలు చేయగా మొదటి టీంలో తహసీల్దార్, రెండో టీంలో డీటీ పర్యవేక్షిస్తారని తెలిపారు. జూన్ 3న కుమ్మర్‌దానిగూడెం, తుమ్మలపల్లి, 4న శిర్థేపల్లి, అంగడిపేట, 5న ఇడకుడ, కస్తాల, 6న బోడంగిపర్తి, కస్తాల, 9న పుల్లెంల, ఉడుతలపల్లి, 10న పుల్లెంల, దోనిపాముల, 11న నెర్మట, చండూరు, 12న బంగారిగడ్డ, చండూరు, 13న చామలపల్లి, బంగారిగడ్డ, 16న గుండ్రెపల్లి, కొండాపురం గ్రామాల్లో ఈ తేదీల్లో గ్రామ సభలు ఉంటాయని వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మలాదేవి, ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్‌లు, రికార్డు అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.పద్మ కోరారు. భూసమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు దరఖాస్తులను అందజేయాలన్నారు. సమావేశంలో డీటీ పార్వతమ్మ, ఆర్ఐ సునిత, ఏఆర్ఐ యాదగిరి, ఎస్ఏ విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తి మండలంలో నేటి నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జరిగే భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పరశురామ్ తెలిపారు. విడతల వారీగా రెండు బృందాల ఆధ్వర్యంలో రోజు రెండు గ్రామాల చొప్పున ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు మండలంలోని తానేదార్‌పల్లి, అనిశెట్టి దుప్పలపల్లి గ్రామాల్లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● శాలిగౌరారం మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.యాదగిరి తెలిపారు. 3వ తేదీన తుడిమిడి, ఉప్పలంచ, రామాంజపురం, 4న ఇటుకులపహాడ్, వద్దిపాముల, 5న గురజాల, మనిమద్దె, 6న వంగమర్తి, నూలగడ్డ కొత్తపల్లి, 9న శాలిగౌరారం, రామగిరి, తిరుమలరాయినిగూడెం, జాలోనిగూడెం, వల్లాల, 10న పెర్కకొండారం, అడ్లూర్, 11న పాత కొండారం, భైరవునిబండ. 12న చిత్తలూరు, ఆకారం, 13న ఊట్కూరు, బండమీదిగూడెం, శాలిలింగోటం. 16న మాదారం, తక్కళ్ల పహాడ్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యాదగిరి తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

● కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు భూభారతి 2025చట్టం కింద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో చెందిన గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్ణయించిన షెడ్యూల్ మేరకు 3న కొప్పోలు, ఇప్పలగూడెం, 4న ఉప్పలపహాడ్, కాసనగోడు, 5న బండపాలెం, బొప్పారం, 6న భీమారం, గుడివాడ, 9న తుంగతుర్తి, కొర్లపహాడ్, 10న చెరుకుపల్లి, ఇనుపాముల, 11న మండల కేంద్రం కేతేపల్లిలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆయన వివరించారు. రెండు బృందాల్లో ఓ బృందానికి తహసల్దార్ అబ్దుల్ సత్తార్, మరో బృందానికి సీనియర్ అసిస్టెంట్ జె.అర్జున్ భగవాన్ టీం లీడర్లుగా వ్యవహరించనున్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తి విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పంట నష్టపోవాల్సి వస్తుందని ఏవో బి. పురుషోత్తం సూచించారు. మండలంలోని భీమారం గ్రామ రైతువేదికలో సోమవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న వివిధ కంపెనీల పత్తి విత్తనాల నుంచి ప్రతీ రెండు, మూడు కంపెనీల విత్తనాలు వినియోగించడం శ్రేయస్కరమన్నారు. రైతులు ఒకే రకం విత్తనాన్ని వినియోగించడం వల్ల ఏదైనా సమస్య వస్తే పూర్తి పంట నష్టపోవాల్సి వస్తుందన్నారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని సూచించారు. భూముల అనుకూలత మేరకు కంది, ఆకు కూరలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటలు పండించే దిశగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇలా పంట మార్పిడి విధానంతో భూసారం పరిరక్షించబడుతుందన్నారు. అనంతరం భీమారంలోని ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఎమ్మార్పీ ధరకు మించి విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో ఉమేష్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



జడ్పీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయగీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, జడ్పీ ఉద్యోగులు



శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లా అభివృద్ధికి అధికారులు ఎప్పటిలాగే కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం నాడు సమావేశ మందిరంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతకాన్ని ఎగురవేసి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకం అమలులో జిల్లాను ముందు ఉంచేలా చూడాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ మునిసిపాలిటీ పరిధిలో రానున్న 100రోజులల్లో చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళికపై ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించి ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల ఆధ్వర్యంలో

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీమాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, విజయ్‌సింహారెడ్డి, కార్పోరేషన్ మాజీ చైర్మన్ రాంచందర్ నాయక్, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, పబ్బు వీరస్వామి, బొలుగూరి నర్సింహ, జిల్లా యాదయ్య, కెఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు.

● చండూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ పుష్పలత పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన కార్యాలయాల ఎదుట జాతీయ జెండా ఎగరవేసి తెలంగాణ విశిష్టతను వివరించారు.

● మర్రిగూడ మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, సీఐ దూది రాజు, ఎస్ఐ కృష్ణారెడ్డి, శ్రీరామదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, రమావత్ శ్రీనివాస్ నాయక్, బచ్చు రామకృష్ణ, దంటు జగన్, తోటకూర శంకర్, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరావు, రాజేందర్ నాయక్, గ్యార యాదగిరి, గ్యార గోపాల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద జెండావిష్కరణ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

● నార్కట్‌పల్లిలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో కే.ఉమేశ్‌చారి, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, పీఆర్‌డీఈఈ మహేశ్, ఏపీవో యాదయ్య, ఏపీఎం శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఏవో గౌతమ్, పంచాయతీ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

● కేతేపల్లిలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ అబ్దుల్ సత్తార్ జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి పురుషోత్తం, కాంగ్రెస్, బీజేపీ నాయకులు జె.ముత్తమ్మ, మట్టి సాల్మన్, జె.వెంకటనర్సయ్యయాదవ్, ఎస్.మంగమ్మ, పి.వెంకట్, ఎ.అనితా గౌడ్, టి.నర్సింహ్మాచారి పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని తహసీల్దార్ బి.పద్మ, ఎంపీడీఓ టి.జయరాం, విద్యుత్ ఏఈ ఆర్ఎన్‌జే.కుమార్, ఎస్ఐ విష్ణుమూర్తి, పీహెచ్‌సీ డాక్టర్ రామక్రిష్ణ, కనగల్, జీఎడవల్లి పీఏసీఎస్ కార్యాలయం ఎదుట వంగాల సహదేవరెడ్డి, దోటిశ్రీనివాస్, పశువైద్యశాల ఎదుట డాక్టర్ బాబు, ఏఓ కార్యాలయం ఎదుట ఏఓ అమరెందర్‌గౌడ్, ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట ఎంఈఓ వి.పద్మ, స్త్రీశక్తి కార్యాలయం ఎదుట సంఘబంధం అధ్యక్షురాలు రాయల రాజేశ్వరి తదితరులున్నారు.

● శాలిగౌరారం మండలంలో తహసీల్దార్ పి. యాదగిరి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతి లక్ష్మీ, ఎస్ఐ డి. సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, ఏవో సౌమ్య శృతి, ఏపీఎం రాములు పాల్గొన్నారు.

● చిట్యాల మునిసిపాలిటీలో కమీషనర్ శ్రీనివాస్, తహీసీల్దార్ క కృష్ణ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జయలక్ష్మి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం చిట్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రైజింగ్ తెలంగాణ 2047పేరుతో నిర్వహించే వంద రోజుల ప్రణాళిక గూర్చి తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు.

● తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వవహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, తిప్పర్తి తహసీల్ధార్ కె. పర్షరామ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎం శ్రీదేవి, డీటీ అబేదాబేగం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్ మండలంలో ఎంపీడీవో జూలకంటి మాధవరెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాములు, పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుకన్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి షఫీ, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న వర్షిత్‌రెడ్డి



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, నాయకులు



జెండావిష్కరణ చేస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సమితి సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే వేముల వీరేశం



చిట్యాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగానే ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ అధికారులతో మాట్లాడారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎన్ని మీటర్లు నిర్మిస్తున్నారు, ఎక్కడెక్కడ అండర్‌పాస్‌లు ఏర్పాటు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిట్యాల పట్టణ ప్రజల కోరిక మేరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిధిలో మరో రెండు అండర్‌పాస్‌లు మంజూరు చేయించినట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, కాటం వెంకటేశం, ఏర్పుల పరమేశం, బొబ్బల రాంరెడ్డి, పోకల అశోక్, బోడ స్వామి, దేశపాక రాజేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి పరిశీలన

చిట్యాలలో జరుగుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల సౌకర్యార్థం మరో రెండు అండర్‌పాస్‌లు మంజూరు చేయించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకులు మాస శ్రీనివాస్, కూరెల్ల శ్రీను, చికిలంమెట్ల అశోక్, జయారపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌ఫిల్టర్ బహూకరణ

నార్కట్‌పల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ లింగోటం జడ్పీ హైస్కూల్‌కు జిందాల్ కంపెనీ ప్రతినిధులు ఎస్‌పీ రాజు, ఆర్ఎస్ గుప్తా, ఇమ్మాన్యుయేల్ పీటర్ సోమవారం రూ.50వేల విలువైన వాటర్‌ఫిల్టర్‌ను అందజేశారు. అలాగే నార్కట్‌పల్లి జడ్పీ హైస్కూల్‌లో షెడ్ నిర్మాణం కోసం ఆ పాఠశాల 1985-86 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు పాల్వాయి ప్రసాద్, పుల్లెంల ముత్తయ్య, అజీజ్, కొప్పు యాదగిరి, బండారు శ్రవణ్‌కుమార్ రూ. 25వేలు సోమవారం హెచ్ఎం రాములుకు అందజేశారు.



పాఠశాల షెడ్ నిర్మాణం కోసం విరాళం అందజేస్తున్న విద్యార్థులు

ఎల్లమ్మ జాతర ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఈఓ జయరామయ్య, మంత్రికి వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

● అమ్మవారి కల్యాణానికి ఆహ్వానించిన ఆలయకమిటీ

కనగల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నల్లగొండ క్యాంపు కార్యాలయంలో దర్వేశిపు రం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆల య కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామ య్య సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. 6వ తేదీన జరిగే అమ్మవారి కల్యాణానికి హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ సిబ్బంది జి.చంద్రయ్య, ఉపేందర్‌రెడ్డి, అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌కుమారచార్యులు, ఉమహేశ్వర్‌రావు, మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ చెనగోని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేయాలి

● శాసన మండలి సభ్యుడు నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గట్టుప్పల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండలంలోని వెల్మకన్నెలో సోమవారం నిర్వహించిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలతో ప్రజాధనం దోచుకుతిన్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాస్ తదితర పథకాలు నిష్పక్షపాతంగా అమలుచేయాలని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యల ను పరిష్కరించాలని ఆయన కోరారు. కారింగు శ్రీను అధ్యక్షత వహించిన ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.లాలయ్య, చాపల శ్రీనివాస్, గట్టుప్పల్ మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు చలం పాండురంగారావు, జగన్, ఏఐవైఎఫ్ నాయకులు గడ్డం నవీన్, కట్ట దశరథ, రాపో లు సత్తయ్య, ధనుంజయ్య, కందాల ముత్యం, దెండే నరసింహ, హైదరాజు లక్ష్మయ్య, మాదగోని యాదయ్య, మాదగోని యాదయ్య, రావుల లక్ష్మయ్య, వల్ల పెంటయ్య, కందాల నాగరాజు, షేక్ బషీర్, కందాల శ్రీశైలం, బాల లింగయ్య, తోటి రాజు తదితరులు పాల్గొన్నారు.

నడకదారిలో గ్రిల్స్ మాయం?



దేవరకొండ రోడ్డులో నడకదారి వెంట ఉన్న గ్రిల్స్‌ను ధ్వంసం చేసిన వ్యాపారస్తులు

» వ్యాపార అవసరాల కోసం ధ్వంసం
» చోరీకి గురవుతున్న లక్షల విలువైన ఐరన్ గ్రిల్స్
» పట్టించుకోని మునిసిపల్ యంత్రాంగం

రామగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ సుందరీకరణలో భాగంగా రెండేళ్ల క్రితం పలు ప్రధాన రహదారుల్లో పాదచారుల సౌకర్యార్థం అప్పటి అధికారులు ప్రత్యేక నడకదారిని ఏర్పా టు చేశారు. పాదచారులకు వాహనదారుల నుంచి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక మా ర్గాన్ని డీఈవో కార్యాలయం నుంచి సాగర్ రోడ్డు వరకు ఏర్పాటు చేశారు. దానికి ఒక వైపు ఐరన్‌తో తయారు చేసిన గ్రిల్స్‌ను ఏర్పా టు చేశారు. ఇదే క్రమంలో వ్యాపార సంస్థల వద్ద అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు ఇబ్బందులు ఎదురు కాకుండా స్థలాన్ని వదులుతూ ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈవిధానాన్ని ఏర్పాటుచేసిన అధికారులు ఇక్కడ ఉన్నంత వరకు ఈ గ్రిల్స్ జోలికి వెళ్లేందుకు ఏ ఒక్కరు సాహిసించ లేదు.అయితే ఆఅధికారి బది లీ కావడంతో దేవరకొండ రోడ్డులో గల కొందరు వ్యాపారులు నడకదారిని యథేచ్ఛగా కబ్జా చేసి వ్యాపారులు నిర్వహించుకుంటున్నారు.

అంతేకాక తమ వ్యాపారాలకు అడ్డుగా ఉన్నాయంటూ అక్కడఉండే ఐరన్‌గ్రిల్స్‌ను ధ్వంసం చేస్తున్నారు. మరికొంత మంది వ్యాపారులు అయితే ఈ గ్రిల్స్ ఇక్కడ ఉంటే తమ వ్యాపారాలు సాగడం లేదని, రాకపోకలకు ఇబ్బంది అవుతుందని, తమ వాహనాలు దుకాణాల ముందుకు తీసుకొచ్చేందుకు వీలు పడటం లేదన్న కారణాలతో అక్కడ ఉన్న గ్రిల్స్‌ను పూర్తిగా తొలగిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తున్నాయి.

నడకదారిపై యథేచ్ఛగా వ్యాపారాలు

నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డుకు ఇరువైపులా వేసిన నడకదారిని అక్కడ వ్యాపారులు యథేచ్ఛగా ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహించకుంటున్నారు. ప్రధానంగా హోటల్ నిర్వాహకులు, పండ్ల, బండ్ల నిర్వాహకులు, బైక్ మెకానిక్‌లు వారితో పాటు ఇతర వ్యాపారులు నడక దారిని ఆక్రమించేశారు.

ఓ ఇంటి యజమాని అయితే అక్కడ నడకదారి కనిపించకుండా పూర్తిగా తన వాకిలి పరిసరాలుగా మార్చుకున్నాడు. దీంతో ఎదచారులు రోడ్డు నుంచి నడుచుకుంటూ ఇబ్బందులు పడక తప్పడం లేదు.

పట్టించుకోని మునిసిపల్ యంత్రాంగం

పాదచారుల సౌకర్యార్థం రూ.లక్షల్లో ఖర్చు చేసి ఐరన్‌తో తయారుచేసిన గ్రిల్స్ ధ్వంసమవుతుంటే పట్టించుకోవాల్సిన మునిసిపల్ యంత్రాంగం అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పాదచారుల కోసం ఏర్పాటు చేసిన నడకదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించుకుంటుండటంతో తప్పని పరిస్థితిలో పాదచారులు రోడ్డుపైనే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటలను ఉన్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ యంత్రాంగం స్పందించి ఐరన్ గ్రిల్స్‌ను ధ్వంసం చేసిన వారిని గుర్తించి, వారి నుంచి నష్టపరిహారాన్ని రికవరీ చేసి ప్రజాధనాన్ని కాపాడాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.


విచారించి చర్యలు తీసుకుంటాం



ఐరన్ గ్రిల్స్ ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అంతే కాకుండా వారి నుంచి జరిగిన నష్టాన్ని రికవరీ చేయడంతో పాటు పోలీస్ కేసు కూడా నమోదు చేస్తాం.

\- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
1
మంగళవారం 3 జూన్ 2025





ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న వైటీపీఎస్ ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల నిర్వాసితులు

ఆర్వోఎఫ్ఆర్ పట్టాల నిర్వాసితులకూ...

ఉద్యోగాలు!

- 200మంది గిరిజన నిర్వాసితులకు దక్కనున్న ఊరట
- తొలివిడతలో ఇళ్లు కోల్పోయిన 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలు
- మరో 440 మందికి కొనసాగుతున్న ప్రక్రియ



నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్మాణంలో అటవీభూములు కోల్పోయిన గిరిజన రైతులకు ఊరట దక్కనుంది. పట్టాభూములు కోల్పోయినవారితో సమానంగా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల రైతుల కుటుంబాలకు కూడా ఉద్యోగాలిప్పిస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. రాష్ట్రానికి వెలుగులు ఇచ్చే బృహత్తర ప్రాజెక్టుకు ఇళ్లు, భూములు త్యాగం చేసిన వారి కుటుంబాలకు ఉద్యోగాలిస్తామనే హామీని నెరవేర్చుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్న ప్రకారం తొలిదశలో 112 మంది గిరిజన నిర్వాసితులకు ఇప్పటికే ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. తాజాగా రెండో దశలో పట్టాభూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలిచ్చే ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఎమ్మెల్యే ప్రకటనతో ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాదారుల సమస్య సైతం కొలిక్కివచ్చేందుకు మార్గం ఏర్పడింది. వీలైనంత వేగంగా ప్రభుత్వం నుంచి అర్హులకు నియామక పత్రాలు ఇప్పించాలని నిర్వాసిత కుటుంబీకులు కోరుతున్నారు.

రెండో విడతలో అందరికీ ఉద్యోగాలొస్తాయనే భరోసా

వైటీపీఎస్ నిర్మాణంలో ఇళ్లను కోల్పోయిన మోదుగుల కుంటతండా, కపూర్‌తండా వాసులతో పాటు, భూములను కోల్పోయిన వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం(కొత్తపల్లి), తిమ్మాపురం గ్రామాలకు చెందిన మొత్తం 573 మందికి తొలుత ఉద్యోగహామీ పత్రాలు అందజేశారు. ఇళ్లను సైతం కోల్పోయిన రెండు తండాలకు చెందిన 133 కుటుంబాలు ఉండగా, వారిలో 112 మందికి ఇప్పటికే ఉద్యోగాలివ్వగా, మరో 21 మందికి త్వరలో ఉద్యోగాలివ్వాల్సి ఉంది. వీరితో పాటు పట్టాభూములు కోల్పోయిన 440 కుటుంబాలకు కుటుంబసభ్యులు ఎవరికి ప్రతిపాదిస్తారో వారి విద్యార్హతలు, వారసత్వ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ప్రభుత్వం సూచించింది. కాగా, వారిలో దాదాపు 344 మంది ఇప్పటికే పత్రాలను అందజేయగా, మిగిలిన 96 కుటుంబాలకు సంబంధించి కొన్నింటిపై అభ్యంతరాలుండగా, మరికొందరు ఎవరికి ఉద్యోగం ఇవ్వాలో తేల్చుకోలేక, ఉద్యోగానికి అర్హత కలిగినవారు లేకపోవడం వంటి కారణాలతో ఇంకా ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేకపోయారు. పట్టాభూములు కోల్పోయిన కుటుంబాలకు చెందినవారికి ఉద్యోగాలిచ్చే నిమిత్తం అధికారిక కసరత్తు పూర్తవగా, ప్రభుత్వం నుంచి అనుమతి రావడమే మిగిలి ఉంది. ఈ నెలలోనే అందుకు సంబంధించి ఉత్తర్వులు వస్తాయని భావిస్తున్న తరుణంలో ఇక్కడ సమస్యగా మిగిలిన ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాదారుల అంశంపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తాజాగా స్పందించి కీలక ప్రకటన చేశారు. అటవీ భూముల్లో సాగుచేసే గిరిజనులకు (ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన) సంబంధించి భూసేకరణ సమయంలో పరిహారం ఇచ్చి, ఉద్యోగ హామీ పత్రాలు ఇవ్వలేదు. అటవీభూములు కోల్పోయినవారు దాదాపు 200 కుటుంబాలుంటే, మలి విడత భూసేకరణలో మరో 90 కుటుంబాల వారు సైతం భూములు కోల్పోగా, వారికి సైతం ఉద్యోగపత్రాలు ఇవ్వలేకపోయారు. తాజాగా, ఎమ్మెల్యే ప్రకటనతో వీరందరికీ ఊరట దక్కే అవకాశం కనిపిస్తోంది.

అందరికీ వైటీపీఎస్‌లో ఉద్యోగాలిప్పిస్తాం



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో అటవీహక్కు యాజమాన్య పత్రాలు ఉండి, భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలకు కూడా ఉద్యోగాలిప్పిస్తాం. పట్టాభూములు కోల్పోయినవారి కుటుంబాల వారితో పాటే వీరికి కూడా ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. భూసేకరణ సమయంలో ఈ రైతుల నుంచి తీసుకున్న పట్టాలు, ఇతర డాక్యుమెంట్లన్నింటినీ వైటీపీఎస్ అధికారులకు అందజేశాం. పట్టాభూములు కోల్పోయినవారితో పాటు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు కోల్పోయినవారి కుటుంబాలకు కూడా ఉద్యోగాలిప్పిస్తాం. ఎవరు అడ్డుకున్నా, ఎంత ఇబ్బందిపెట్టినా మిర్యాలగూడ అభివృద్ధికి కట్టుబడి ఉన్న.

- బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే



బయోమెట్రిక్ పరేషన్

- ఒక్కో వినియోగదారుడి నుంచి పలుమార్లు వేలిముద్రల సేకరణ
- నెలాఖరు వరకు బియ్యం పంపిణీ

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మూడు నెలలకు ఒకేసారి రేషన్ ఇవ్వాలన్న ఓ మంచి నిర్ణయానికి బయోమెట్రిక్ సమస్యగా మారింది. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఒకేసారి మూడు నెలల రేషన్ అందించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ నిర్ణయం మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం ఒకేసారి పంపిణీ చేయనున్నారు. సన్నబియ్యం పంపిణీతో పాటు మూడు నెలలు ఒకేసారి రేషన్ బియ్యం ఇవ్వనుండటంతో లబ్ధిదారులకు రేషన్‌దుకాణాలకు తిరగాల్సిన పరిస్థితి తప్పింది. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 4.66లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. అందుకు సంబంధించి 950 దుకాణాల నుంచి రేషన్‌ను సరఫరా చేస్తున్నారు. మూడు నెలలకుగాను 26,605మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నప్పటికీ బయోమెట్రిక్ విధానం సమస్యగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కిలో ఇస్తున్న నేపథ్యంలో పలుమార్లు వేలిముద్రలు వేయాల్సిన పరిస్థితి ఉండటంతో సర్వర్ బీజీగా మారింది. దీంతో ఒక్కో వినియోగదారుడు 20 నిమిషాల నుంచి గంటపాటు రేషన్‌దుకాణం వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. 10 కిలోలు, 20, 30కిలోల బియ్యం పంపిణీకే వేలిముద్రలు తీసుకుంటోందని, మిగతా బియ్యం కోసం మళ్లీ వేళి ముద్రలు వేయాల్సి వస్తోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఇద్దరు లబ్ధిదారులు ఉంటే 12కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు 10కిలోలకు ఒకసారి, రెండు కిలోలకు ఒకసారి వేలిముద్రలు తీసుకోవాల్సి వస్తోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. అదే విధంగా బియ్యం పంపిణీ చేసిన అనంతరం స్టాక్ నిల్వను కూడా సరిగా చూపడం లేదు. రేషన్ బ్యాగుల్లో కూడా తేడా ఉన్నట్లు సమాచారం. ఒక బ్యాగులో బియ్యం ఎక్కువగా మరో బ్యాగులో బియ్యం తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సాఫ్ట్‌వేర్‌ను

- మిగతా 5వ పేజీలో...



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

- ప్రజల బంగారు భవిష్యత్తు కోసం సంక్షేమ పథకాలు
- రైతులను రుణ విముక్తులను చేశాం
- యువతకు పెరిగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల బంగారు భవిష్యత్తు కోసం పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రాష్ట్రాన్ని దేశంలో ప్రథమస్థానంలోకి తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

- ఆడబిడ్డల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని 4.64కోట్ల మంది వినియోగించుకున్నారన్నారు. అందుకు గాను మహిళలకు రూ.203.75కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 2,34,994మంది లబ్ధిదారులకు 6,47,822 సిలిండర్లు పంపిణీ చేశామని, అందుకు సబ్సిడీ రూ.18,58,74,000 ఇచ్చామన్నారు.
- ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిది నెలల్లోనే జిల్లాలో రూ.2లక్షల రుణ మాఫీ కింద మొత్తం 2,33,981మంది రైతులకు రూ.2044.83కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. రైతుభరోసా ఎకరాకు రూ.6వేల చొప్పున ఈ యాసంగిలో ఇప్పటి వరకు 4,33,543మంది రైతుల ఖాతాలో రూ.413.93కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,91,729మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని, ఇప్పటి వరకు రైతులకు రూ.1210.04కోట్లు చెల్లించామన్నారు.
- దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. పారదర్శకంగా కులగణన నిర్వహించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాజీవ్ అభయ హస్తం కింద సివిల్స్ చదివే వారికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఏడాదిలోనే 60వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు.
- ప్రతీ నియోజవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడానికి నిర్ణయించామన్నారు. జిల్లాకు 19,698 ఇళ్లు కేటాయించి 16,412 ఇళ్లకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అందులో మొదటి విడత 1,906 మంజూరు కాగా 610 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయిందన్నారు.
- బ్రాహ్మణవెల్లెంల-ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాలుగు నియోజకవర్గాలు, ఏడు మండలాలు, 94 గ్రామాలకు సాగునీరు, 107 తాగునీరు అందుతోందన్నారు. భూ సేకరణ కోసం రూ.61కోట్లను కేటాయించామన్నారు. డిండి ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం 12,454ఎకరాల భూసేకరణ చేశామన్నారు.
- నల్లగొండ పట్టణంలో లతీఫ్‌సాహెబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్ట వరకు ఘాట్ నిర్మాణం కోసం రూ.140కోట్లను మంజూరు చేశామన్నారు. కలెక్టరేట్ అదనపు గదుల నిర్మాణం కోసం రూ.36కోట్లు కేటాయించామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు వెళ్లడానికి రోడ్ల నిర్మాణానికి రూ.236కోట్లు మంజూరు చేశామన్నారు.
- జిల్లాలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపామని, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చెక్‌పోస్టు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచామన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలను మూసివేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో మూసివేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం మండలంలోని తవక్లాపూర్, డిండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని 11 కేంద్రాల్లో కొనుగోలు పూర్తిచేసేందుకు రెండు రోజులు గడువు ఉందన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు డ్రయర్‌లను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వరికోతలు ఆలస్యంగా మొదలవడంతో కొనుగోలులో జాప్యం జరిగిందని పీఏసీఎస్ అధికారులు వివరించారు. లారీల కొరత ఉందా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆరబోసిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం మానవ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో భిక్షపతి, డీఎస్‌వో వెంకటేష్, డీఎం హరీష్, తహసీల్దార్ అంబటి అంజనేయులు, డీసీవో పత్యానాయక్, డీటీ(సీఎస్) హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, ఎంఈవో గోప్యానాయక్, ఏవో రెహానా, డీఈవోలు బాల్‌రెడ్డి, అంతిరెడ్డి, ఏఈవో పరమేశ్వరి, తదితరులు ఉన్నారు.

స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన...

కొండమల్లేపల్లి: ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ పంచాయతీ సర్వే నెం. 202లో కేటాయించిన 20ఎకరాల స్థలాన్ని ఆర్డీవో రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ ఓర్సు శ్రీనివాస్, ఏఈలు లష్కర్, సర్వేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

నిడమనూరు కోర్టు రోల్ మోడల్‌గా పనిచేయాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



సభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నిడమనూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కేసులను సత్వరమే పరిష్కరిస్తూ కక్షిదారులకు న్యాయం అందించడంలో నిడమనూరు కోర్టు మిగతా కోర్టులకు రోల్ మోడల్‌గా పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అన్నారు. సోమవారం నిడమనూరు కోర్టు భవన సముదాయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజొయ్‌పాల్ వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం కోర్టు భవనాన్ని, జడ్జి నివాసాలను నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడమనూరు కోర్టుకు మూడేళ్లలో సొంత భవనం ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని, కోర్టు భవన శంకుస్థాపనకు, ప్రారంభోత్సవానికి తాను రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నిడమనూరు కోర్టు పరిధిలో 3,756 కేసులు విచారణలో ఉన్నందున అదనపు కోర్టు ఏర్పాటు అవసరముందన్నారు. నిడమనూరుకు అదనపు కోర్టును సాధించే సత్తా బార్ అసోసియేషన్‌కు ఉందన్నారు. తరచూ తాను కోర్టు పర్యవేక్షణకు వస్తానని, కోర్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కోర్టు భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయించినందుకు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. సమావేశంలో నిడమనూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పవన్‌కుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి సంపూర్ణ ఆనంద్, ఐదో అదనపు జిల్లా జడ్జి వేణు, అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, న్యాయవాదులు మువ్వా అరుణ్ కుమార్, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, పెద్దబోయిన శ్రీనివాస్, ఉన్నం సత్యనారాయణ, అబ్దుల్‌హలీం, రమణారెడ్డి, నాగరాజు, రఘురామారావు, జయమ్మ, వినోద్, వాణి, కోర్టు సిబ్బంది శర్మ, మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో 'రైతు నేస్తం'

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జేడీఏ పి. శ్రవణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతునేస్తం కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. తిప్పర్తి రైతు వేదిక నుంచి వ్యవసాయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు సూచనలు ఇస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫౌండేషన్ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



ఫౌండేషన్ విత్తనాలను అందజేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ సీడ్ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పి. శ్రవణ్‌కుమార్ కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు జిల్లాకేంద్రంలో సోమవారం ఫౌండేషన్ సీడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకొని విత్తనోత్పత్తికి కృషి చేయాలన్నారు. ధాన్యానికి సంబంధించి రెండు కిట్లు, పెసర్లు ఒక కిట్‌ను పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలోని 33 మండలాల్లో 140 క్లస్టర్‌లను ఎంపిక చేయగా అందులో 564 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి 564 గ్రామాలకు మొత్తం 1692 కిట్లు పంపిణీ చేశామని, వీటిలో వరి విత్తనాల కిట్లు 1128 ఉండగా పెసర్లు 564 కిట్లు ఉన్నాయన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసి ఆ విత్తనాలు వేయడం ద్వారా విత్తన ఉత్పత్తిని సాధించడం కోసం ఈ ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మండల ఏవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు 283 రిజిస్ట్రేషన్లు



నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానంలో తొలి డాక్యుమెంట్‌ను అందజేస్తున్న ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రకాష్

ప్రతి పైసా పేదలకు ఉపయోగపడాలి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసా పేదలకు ఉపయోగపడాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి, కొంపెల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో, నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చీకటిమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 21 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, ఇన్‌చార్జి ఎమ్మార్వో నరేష్, ఎంపీవో స్వరూప, కాంగ్రెస్ నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, పాల్వాయి జితేందర్‌రెడ్డి, అబ్బరబోయిన రాంయాదవ్, భీమనపల్లి సైదులు, వెదిర విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు జాల వెంకన్నయాదవ్, తాటికొండ సంతోష సైదులు, పాలకూరి యాదయ్యగౌడ్, అనంత లింగస్వామిగౌడ్, జలమణి పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి'

దామరచర్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేశ్యానాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. హామీలను అమలు చేయక పోతే పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జానకిరాంరెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, లింగానాయక్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి'

మిర్యాలగూడటౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు బెలిదె వీరప్రతాప్ అన్నారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత రవాణా పింఛన్లు అందించడం హర్షనీయమన్నారు. ఇందరమ్మ ఇళ్లు సైతం త్వరితగతిన అందించాలని కోరారు. పార్టీలు, పైరవీలకతీతంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్నారు.

సమాచారం

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

● *సీఐ జనార్దన్‌గౌడ్*

హాలియా, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్ అన్నారు. హాలియా మునిసిపాలిటీ, అనుముల మండలంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులను సోమవారం విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ల ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ జనార్ధన్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా క్రమశిక్షణతో కష్టపడి చదివితే మంచి విజయాలు సాధించవచ్చని తెలిపారు.

యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, తహసీల్దార్ రఘు, మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఆర్‌ఐ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మార్పు వచ్చేనా..?



మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయం

- మునిసిపల్ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి
- స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

(మిర్యాలగూడటౌన్, ఆంధ్రజ్యోతి)

ఎవరికి వారే..యమునా తీరే అన్నట్లుగా మారింది మి ర్యాలగూడ మునిసిపాలిటీ పరిస్థితి. పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆటగా మా రింది. విభాగానికో అధికారి పెత్తనం చెలాయి స్తూ అవినీతికి పాల్పడుతున్నాడనే ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలోనే గ్రీన్ బడ్జెట్ పేరుతో నిధులు స్వాహా జరిగిందనే వార్త గుప్పుమనగా, సమగ్ర విచారణ జరిపించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ కలెక్టర్, ఎమ్మెల్యేలను సోషల్ మీడియా వేదికగా కోరారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో మునిసిపల్ అధికారులు రూ.70లక్షలు కాజేసేందుకు చెక్కులు జారీ చేశా రు. ఇదే విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మిర్యాలగూడ మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వెంటనే కార్యాలయంలోని పలువురు ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో కార్యాలయ పనితీరులో మార్పు వచ్చేనా.. అని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మెమోలు జారీ చేసిన అదనపు కలెక్టర్

మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెనువెంటనే కార్యాలయ అధికారుల పనితీరుపై ఆరా తీశారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరున మొక్కలు నాటకుండానే బిల్లులు ఎలా రికార్డు చేశారంటూ ప్రశ్నించారు. జారీ చేసిన చెక్కులు పాస్ కాకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు



స్పెషల్ ఆఫీసర్ ఆదేశాలతో కార్యాలయంలోని ప్రతీ విభాగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. అవినీతి, అక్రమాలకు తావులేకుండా చూస్తున్నాం. విధులపై నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పక ఉంటాయి. పలు విభాగాల అధికారులు, ఉద్యోగులను మార్చడంతో పాటు కొందరికి నోటీసు ఇవ్వడం జరిగింది.

\- యూసుఫ్, కమిషనర్

కార్యాలయంలో పలువురు అధికారులు, ఉద్యోగుల శాఖలు మార్చారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్య విధులకు సక్రమంగా హాజరు కాని కారణంగా ఆ శాఖ డైరెక్టరేట్‌కు సరెండర్ చేశారు. ఇంజనీరింగ్ విభాగ ఉన్నతాధికారి, అకౌంటెంట్, ఆపరేటర్, అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పౌరసేవలు అందించడంలో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

ఆ రెండు శాఖలే కీలకం

మునిసిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. అక్కడుండే అధికారులు ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు. ఇంజనీర్లు ఫీల్డ్ వర్క్ అని కాంట్రాక్టర్లతో చక్కర్లు కొడుతుండగా, అదనపు బాధ్యతలు, డిప్యుటేషన్లంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు లైసెన్స్‌డ్ ఇంజనీర్లతో మమేకమవుతున్నారు. ఈ తరుణంలో పనుల నిమిత్తం ఆయా సెక్షన్లకు వచ్చిన సాధారణ పౌరులకు అక్కడుండే దిగువ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

ఎం.రాంమూర్తి, ఎస్‌ఐ



మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్‌ఐ రాంమూర్తి అన్నారు. వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆయన శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(చింతపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా, వెంటనే అప్రమత్తమవుతున్నాం. ముందు కూడా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్‌ఐ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీరోజు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా సంబంధిత వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. అలాగే కెపాసిటీకి మించి వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళ్లడం, ద్విచక్రవాహనంపై ముగ్గురు కంటే ఎక్కువ మంది వెళ్తే చర్యలు తీసుకుంటాం. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: యువత వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: యువత వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, మద్యం వాటి వల్ల ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు గురించి యువతకు వివరిస్తున్నాం యువత సన్మార్గంలో పయనించాలని సూచిస్తున్నాం.

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

● *ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బీఎల్‌ఆర్, బాలునాయక్*

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం డివిజన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ తాగు, సాగునీ టి ప్రాజెక్టులకు వేల కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీతో పాటు రూ.500 బోనస్ అందజేసినట్లు వెల్లడించారు.

మిర్యాలగూడలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పట్టణ సమస్యలు, అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల అవినీతికి కారణంగా అస్తవ్యస్తంగా తయారైన వ్యవస్థలను గాడిన పెట్టే వైపునకు అడుగులేస్తున్నట్లు తెలిపారు. కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని, సోషల్ మీడియా వేదికగా పనికిరాని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీలకతీతంగా అందరూ కలిసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం పార్టీలకతీతంగా ప్రజలందరికీ ప్రయోజనం చేకూరేలా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలు అర్హులకందేలా చూడాలన్నారు.

మిర్యాలగూడ పట్టణంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పించిన అనంతరం వైజంక్షన్ నుంచి కళాభారతి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు బతుకమ్మలతో కోలాట ప్రదర్శన నిర్వహించగా, నటరాజ నాట్యకళా సంస్థ చిన్నారులు నృత్యప్రదర్శనలతో అలరించారు.



మిర్యాలగూడ పట్టణంలో సమైక్య ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



బతుకమ్మల ర్యాలీతో కళాభారతి వద్దకు చేరిన మహిళలతో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి : సబ్ కలెక్టర్

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా క్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందించిందన్నారు. ఆయా పథకాలు అర్హులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా సీఎం సహాయనిధి సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మునిసిపాలిటీకి నూతనంగా వచ్చిన ట్రాక్టర్లు, ఆటోలను ప్రారంభించారు. బీఎల్‌ఆర్ బ్రదర్స్ పథకమైన ఈశ్వర బంధాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్పీ రాజశేఖరరాజు, మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, ఎంఈ వెంకన్న, సీడీపీవో మమత, అధికారులు వెంకటరమణ, అంజ య్య, జ్ఞానేశ్వరి, చంద్రకళ, పార్వతి, నాయకులు కొమ్ము శ్రీను, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణ, సలీం, అమృతారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసింది తమ పార్టీనేనన్నారు. కార్యక్రమంలో నాయకులు బంటు సైదులు, తల్లం అశోక్, కనపర్తి సత్యప్రసాద్, దొండపాటి వెంకటరెడ్డి, బంటు గిరి, శ్యాం, సీతారాంరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తిచేసి నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రాజెక్టులను పూర్తిచేసి సాగు, తాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని ఆయన జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించేందుకు మిషన్‌భగీరథ ద్వారా నిధులు మంజూరుచేసి సాగు, తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మునిసిపల్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు.

● హాలియా హాలియా మునిసిపాలిటీ, అనుముల మండలంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మునిసిపాలిటీ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రఘు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుజాత, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, మండలంలోని ఆయాగ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములపల్లి, పెద్దఅడిశర్లపల్లి, తిరుమలగిరి(సాగర్), కొండమల్లేపల్లి, పెద్దవూర మండలాల్లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. నిర్వహించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట తహసీల్దార్లు, ఎంపీడీవో కార్యాలయాల్లో తహసీల్దార్లు, మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో జెండా ఆవిష్కరణలు చేశారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో మండల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఆర్డీవో రమణారెడ్డి, నాయకులు

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ నగేష్

పెద్దవూర, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉత్తమ వైద్యాధికారిగా పెద్దవూర మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకటించిన ఉత్తమ పురస్కారాల్లో డాక్టర్ నగేష్ ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. నల్లగొండ పట్టణంలోని పరేడ్‌గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ చేతులమీదుగా ఆయన ఉత్తమ పురస్కారాన్ని, ప్రశంసపత్రాన్ని అందుకున్నారు.

తెలంగాణ రూపురేఖలు మార్చిన కేసీఆర్

● *బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్*

దేవరకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీ ఎం కేసీఆర్‌కే దక్కిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలం ఇద్దంపల్లిలో సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 15 కేజీల కేకును కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని కొనియాడారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, సుభాష్, గోపాల్‌గౌడ్, పులిరాజు, చంద్రమౌళి, జా నిబాబా, యేసోబు తదితరులు పాల్గొన్నారు.



ఇద్దంపల్లిలో 15 కిలోల కేకును కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

వంద రోజుల ప్రణాళికలో సమస్యలన్నీ పరిష్కారం



దేవరకొండ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేస్తున్న మునిసిపల్ అధికారులు, సిబ్బంది

● *దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్*

దేవరకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికలో పట్టణంలోని అన్ని సమస్యలను పరిష్కరించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం మునిసిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ సుదర్శన్ మాట్లాడుతూ దేవరకొండ మునిసిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీల నిర్మాణంతోపాటు సమస్యలన్ని పరిష్కరిస్తామన్నారు. సమస్యలు ఉంటే వార్డు ప్రజలు వార్డు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, శక్రునాయక్, జగమంతు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో 72 కోతులను పట్టుకొని శ్రీశైలం అడవుల్లో వదిలిపెట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జయశ్రీ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ నెల 3వ తేదీ నుంచి భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. 3న మ ల్లాపురం, 4న వద్దిపట్ల, 5న పిఏపల్లి, 6న మేడారం, 9న దుగ్యాల, 10న తిరుమలగిరి, 11న పెద్దగట్టు, 12న నంబాపురం, 13న అజ్మాపురం, 16న యల్లాపురం, 17న పెద్దగుమ్మడం, 18న పావురాలగట్టు, 19న వి.వి.పహాడ్ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారని వివరించారు. ఈ సదస్సులను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారుడు ఆధార్‌కార్డు, పాత పాస్ పుస్తకం, కొత్త పాస్‌పుస్తకం, ఓఆర్‌సీ సర్టిఫికెట్, లావుని పట్టా సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, సాదాబైనామా పత్రాలు, తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులు, కోర్టు ఉత్తర్వులు, 13(బి) సర్టిఫికెట్, 1(బి) పహాని, పత్రాల్లో ఏవీ ఉన్నా దరఖాస్తు వెంట జతపరచాలని సూచించారు.

● నిడమనూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. తహసీల్దార్, డీటీ ఆధ్వర్యంలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూసమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. 3న బొక్కమంతలపహడ్, 4న వేంపాడ్, 5న సూరేపల్లి, 6న గుంటిపల్లి, 9న ఊట్కూరు, 10న శాఖాపురం, 11న మారుపాక, 12న వెనిగండ్ల, 13న రేగులగడ్డ, 16న ఎర్రబెల్లి, 17న తుమ్మడం, 18న వల్లభాపురం, 19న ముప్పారం, 20న నిడమనూరు, బంకాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహించనున్నామని, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● వేములపల్లి: మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హేమలత తెలిపారు. 3న ఆమనగల్లులోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి భూ సమస్యలపై వచ్చే అర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. అదేవిధంగా ఈ నెల 4న అన్నపరెడ్డిగూడెం, 5న బుగ్గబావిగూడెం, 6న చలిచీమలపాలెం, 9న శెట్టిపాలెం, 10న కామేపల్లి, 11న మొల్కపట్నం, 12న రావులపెంట, 13న సల్కునూరు, 16న తిమ్మారెడ్డిగూడెం, 17న వేములపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● హాలియా: అనుముల మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రఘు తెలిపారు. 3వ తేదీన అన్నారం, 4వ తేదీన వెంకటాద్రిపాలెం, కొసలమ ర్రి, 5వ తేదీన అంబట్‌పల్లి, శ్రీనాథపురం, 6వ తేదీన కుపాస్‌పల్లి, కు మ్మరి కుంటకాల్వ, 9వ తేదీన మారేపల్లి, నారాయణపురం, 10వ తేదీన రామడుగు, 11వ తేదీన ముక్కమాల, పులిమామిడి, 12వ తేదీన కొత్తపల్లి, 14వ తేదీన అనుముల, 16వ తేదీన పాలెం, తిమ్మాపురం, 17వ తేదీ న పేరూరు, 18వ తేదీన ఇబ్రహీంపేట, 19వ తేదీన యాచారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● తిరుమలగిరి(సాగర్): మండలంలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. 3వ తేదీన చింతలపాలెం, 4న నెల్లికల్, 5న తిమ్మాయిపాలెం, 6న జమ్మనకోట, 9న ఎల్లాపురం, 10న తునికినూతల, 11 కోనేటిపురం, 12న నేతాపురం, 13న రాజవరం, 16న చిలకాపురం, 17న శ్రీరాంపురం, 18న అల్వాల, 19న తి రుమలగిరి, 20న కొంపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● పెద్దవూర: మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. 3వ తేదీన పెద్దవూర, 4న వెల్మగూడెం, 5న చలకుర్తి, 6న గర్నెకుంట, 9న పర్వేదుల, 10న కొత్తలూరు, 11న పులిచర్ల, 12న తమ్మడపల్లి, 13న ఉట్లపల్లి, 16న తుంగతుర్తి, 17న పోతునూరు, శిరసనగండ్ల, 18న పోలేపల్లి, చింతపల్లి, 19న పిన్నవూర, లింగంపల్లి, 20న సంగారం, తెప్పలమడుగు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

● గుడిపల్లి (పెద్దఅడిశర్లపల్లి): భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మధుహాసిని సూచించారు. అధికారులు రెండు టీమ్‌లతో మండలంలోని గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. 3వ తేదీన రోళ్లకల్లు, సూరేపల్లి, 4న పోల్కంపల్లి, ఘట్‌నెమలిపురం, 5న మదాపురం, ఘనపురం, 6న ఘనిపల్లి, చిలకమ ర్రి, 9న భీమనపల్లి, కేశంనేనిపల్లి, 10న గుడిపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : భైరవం / వెంకటేశ్వర: ఖలేజా, ఏస్ / రాఘవ: ఖలేజా, కరాగే కిడ్ లెజెండ్ / విట్రోస్: ఖలేజా, భైరవం, దేవరకొండ : మనోజ్ : భైరవం / మైత్రి వెంకటేశ్వర : కరాటే కిడ్